నేడు అర్జీల స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్ జూన్ 30: జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ స్థాయిలో ఆర్డీవో, మునిసిపల్ స్థాయిలో కమిషనర్లు, మండల స్థాయిలో సంబంధిత అధికారులు అందుబాటులో ఉండి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

పింఛన్ల పండుగ

పండుటాకుల ఆనందాల వేడుక


(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

రూ.7,000 అందుకునే సంబరం

- ఇంటి వద్దకే 'ఎన్టీఆర్ భరోసా'
- వృద్ధులకు రూ.7 వేలు, దివ్యాంగులకు రూ.6వేలు
- నేడు పంపిణీ చేయనున్న సచివాలయ సిబ్బంది, కూటమి క్యాడర్

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ఓ పండగలా జరగనుంది. సార్వత్రిక ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పింఛన్‌ను రూ.3 వేల నుంచి 4 వేలకు పెంచడంతో పాటు ఏప్రిల్ నెల నుంచే వీటిని అమలు చేస్తామని చెప్పిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం ఒక్కొక్కరికి రూ.7వేల వంతున పింఛన్ ఇవ్వనున్నారు. జిల్లాలో మొత్తం 18 రకాల పింఛన్లు ఉన్నాయి. అందులో వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, వీవర్స్, కల్లుగీత కార్మికులు, ఫిషర్‌మెన్, గీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్, ఏఆర్‌టీ హెచ్ఐవీ, డప్పు కళాకారులు ఇలా ఈ కేటగిరీల్లో ఉన్న వారికి గతంలో రూ.3 వేలు ఇచ్చేవారు. వారికి ఇక నెలకు రూ.4 వేల వంతున వస్తుంది. కానీ ఏప్రిల్ నుంచి ఇది అమలు చేయడం వల్ల ఏప్రిల్, మే, జూన్ నెలలో వేయితో కలిపి రూ.7 వేలు వంతున పంపిణీ చేయనున్నారు. దివ్యాంగులు, కుష్ఠు బాధితులకు ఇచ్చే పెన్షన్ సొమ్మును రూ.3 వేల నుంచి 6 వేలుకు పెంచారు. వారికి సోమవారం రూ.6 వేలు అందజేయనున్నారు. పూర్తి దివ్యాంగులు, మస్కిలర్ జిస్ట్రోఫి, పెరాలసిస్‌తో బాధపడుతుతూ వీల్ ఛైర్‌లేదా, బెడ్ మీద ఉన్నవారికి, రూ.5 వేల నుంచి 15 వేలకు పెంచారు. కిడ్నీ, లివర్, హార్ట్, సీకేడీయూ, సీకేడీయూ డయాలసిస్ పింఛన్లు రూ. 5వేల నుంచి 10 వేలకు పెంచిన సంగతి తెలిసిందే. జిల్లాలో మొత్తం 2,44,302 పింఛన్‌దార్లకు రూ.165.13 కోట్ల డబ్బు అందనుంది. దీనికి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఇప్పటికే ఏర్పాట్లు చేయించారు.

4092 మంది సిబ్బంది

పింఛన్ల పంపిణీకి సిద్ధం

కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం, జూన్ (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సోమవారం ఉదయం 6 గంటల నుంచే పంపిణీ చేయనున్నామని, పంపిణీ నిమిత్తం 4092 మంది ఉద్యోగులను సిద్ధం చేశామని, అందులో సచివాలయ ఉద్యోగులు 3905 మంది, ఇతర శాఖల ఉద్యోగులు 187 మంది ఉన్నారని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఆదివారం ఆమె పింఛన్ల పంపిణీపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పింఛన్ పంపిణీతో పాటు ప్రతీ లబ్ధిదారుడికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాసిన లేఖను అందజేయాలన్నారు. ఉదయం 5 గంటల నుంచే అందరూ సన్నద్ధంగా ఉండాలని, పింఛన్ పంపిణీ చేశాక, నగదు అందినట్టు రశీదు తీసుకోవాలన్నారు.

నియోజకవర్గాల వారీగా..ఇలా

కొవ్వూరు నియోజకవర్గంలో 31,716 మందికి రూ. రూ.21,24,32,000 పంపిణీ చేస్తారు. నిడదవోలు నియోజకవర్గంలో మొత్తం 35817 మందికి రూ.24,18,17,500 పంపిణీ చేయనున్నారు. రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 39,777 మందికి రూ.26,67,14,500 పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. అనపర్తి నియోజకవర్గంలో మొత్తం 30,260 మందికి రూ.20,21,92,500 పంపిణీ చేసేందుకు రంగం సిద్ధమైంది. గోపాలపురం నియోజకవర్గంలో 32,058 మందికి రూ.21,80,25,000 పంపిణీ చేయనున్నారు. జిల్లాలో ఏఆర్‌టీ (పీఎల్ హెచ్ఐవీ) కింద 2531 మందికి రూ.1,77,17,000 మొత్తం జిల్లాలో 2,44,302 మందికి రూ.165 కోట్ల 13 లక్షల, 29 వేల 500 పంపిణీ చేయనున్నారు. రాజానగరం నియో జవర్గంలో అత్యధికంగా 39,777 మందికి రూ. 26 కోట్ల, 67 లక్షల 14 వేల 500 పంపిణీ చేయనున్నారు.

మండలం	పింఛన్‌దారులు	రూ.కోట్లలో
అనపర్తి	10,439	రూ.6,99,57,500
బిక్కవోలు	10786	రూ.7,14,02,000
రంగంపేట	9035	రూ.6,08,33,000
దేవరపల్లి	11,171	రూ.7,58,86,000
గోపాలపురం	9238	రూ.6,30,14,500
నల్లజర్ల	11,649	రూ.7,91,24,500
గోకవరం	10,701	రూ.7,20,87,500
చాగల్లు	9503	రూ.6,34,69,500
కొవ్వూరు	10,257	రూ.6,82,32,000
కొవ్వూరు(మున్సిపాల్టీ)	4015	రూ.2,78,51,000
తాళ్లపూడి	7941	రూ.5,28,79,500
నిడదవోలు	10,551	రూ.7,05,80,000
నిడదవోలు(మున్సిపాల్టీ)	4334	రూ.2,99,97,000
పెరవలి	10,420	రూ.6,95,34,000
ఉండ్రాజవరం	10,512	రూ.7,17,06,500
కడియం	12,144	రూ.8,20,43,500
కోరుకొండ	12,474	రూ.8,20,43,500
రాజానగరం	15,564	రూ.10,43,00,000
సీతానగరం	11,739	రూ.7,79,41,500
రాజమండ్రి (అర్బన్)	29,436	రూ.20,24,48,000
రాజమండ్రి(రూరల్)	32,006	రూ.21,78,95,500
రూరల్ (వార్డుల పరిధి)	19,862	రూ.13,58,52,000

6 గంటలకే ఇంటింటికి..

పెంచిన పింఛన్ల సొమ్మును సోమవారం లబ్ధిదారుల ఇళ్లవద్దకే ఉదయం 6 గంటలకు వెళ్లి టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, అధికారుల సమక్షంలో సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేయనున్నారు. సోమవారం మొత్తం పింఛన్లను పంపిణీ చేసేందుకు సమాయత్తమయ్యారు. ఒకవేళ ఏవైనా పెండింగ్ ఉంటే మంగళవారం పంపిణీ చేస్తారు. పింఛన్ల పంపిణీ సమయాన ఎవరైనా లేకపోయినా తర్వాత తీసుకునే వెసులుబాటు కూడా ఉంది. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నిడదవోలు మండలం గోపవరంలో మొదట పంపిణీ చేస్తారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి రాజమండ్రి రూరల్ మండలంలోని కోలమూరులో ఉదయం 6 గంటలకు పింఛన్ల కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఉదయం 7 గంటలకు హుకుంపేట డి బ్లాక్ నుంచి పంపిణీ మొదలు పెట్టి, శాటిలైట్ సిటీ, బొమ్మూరు ఎస్సీ పేట, ధవళేశ్వరం పంచాయతీ ఆఫీసు వద్ద, కడియం మండల ఆఫీసు, సిటీలోని 16వ వార్డులోని మేకల కబేళా వద్ద, 27వ డివిజన్‌లోని అంగన్‌వాడీ స్కూల్ కార్యక్రమాల్లో పాల్గొంటరు. కలెక్టర్ ప్రశాంతి, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు వీఎల్‌పురం పార్కు వద్ద ఉదయం 6 గంటలకు పెన్షన్ల పంపిణీని మొదలు పెడతారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ కలిసి ఉదయం 6గంటలకు రాజానగరంలోనూ, 7 గంటలకు కోరుకొండలోనూ, 8గంటలకు సీతానగరంలోనూ పింఛన్లను పంపిణీ చేస్తారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఉదయం 6 గంటలకు అనపర్తి, ఏడు గంటలకు బిక్కవోలు, 9గంటలకు పెదపూడి మండలంలోనూ పంపిణీ చేస్తారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఉదయం 6 గంటలకు ద్వారకా తిరుమలలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభించి, ద్వారకా తిరుమల మండలంలో 10 చోట్ల, నల్లజర్ల మండలంలో 10 చోట్ల, గోపాలపురంలో 10 చోట్ల, దేవరపల్లిలో పది చోట్ల మొత్తం 40 చోట్ల ఆయన భాగస్వామ్యం కానున్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కొవ్వూరులో మూడుచోట్ల పంపిణీ చేయనున్నారు.

నేడు డిప్యూటీ సీఎం పవన్ రాక



- గొల్లప్రోలులో పింఛన్ల పంపిణీలో పాల్గొననున్న జనసేనాని
- ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్
- పర్యటనకు భారీ బందోబస్తు
- మూడురోజులపాటు జిల్లాలో కార్యక్రమాలు

పిఠాపురం/గొల్లప్రోలు, జూన్ 30: పిఠాపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత తొలిసారి పిఠాపురం నియోజకవర్గానికి రానున్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత కొణిదెల పవన్‌కల్యాణ్ పర్యటనకు సర్వం సిద్ధమైంది. ఇటు అధికార యంత్రాంగంతోపాటు జనసేన, టీడీపీ, బీజేపీ నేతలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి పిఠాపురం నియోజకవర్గానికి సోమవారం వస్తున్న పవన్‌కల్యాణ్ గొల్లప్రోలులోని సత్యకృష్ణ కల్యాణమండపంలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాలుపంచుకోనున్నారు. పవన్ చేబ్రోలు నివాసంలో మూడు రోజులు ఉండనున్న నేపథ్యంలో అక్కడ భారీఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతోపాటు ఇంటిపై భారీ బెలూన్ ఏర్పాటు చేశారు. ఇంటివద్ద బారికేడింగ్ ఏర్పాటు చేశారు. కాగా పవన్ పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సగిల షాన్‌మోహన్ పరిశీలించారు. గొల్లప్రోలు హెలిప్యాడ్‌తోపాటు పవన్ పర్యటించే ప్రాంతాల్లో పరిశీలన జరిపి అధికారులకు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట కాకినాడ ఆర్డీవో కిషోర్, డీఎస్పీ హనుమంతరావు, డీఆర్డీఏ పీడీ శ్రీరమణి తదితరులు ఉన్నారు.

పవన్ పర్యటన సాగేది ఇలా..

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సోమవారం నుంచి మూడురోజులపాటు కాకినాడ జిల్లాలో పర్యటించనున్నారు. పవన్ పర్యటన వివరాలను అధికారికంగా ఆదివారం రాత్రి వెల్లడించారు.

నేడు పింఛన్ల పంపిణీ

సోమవారం ఉదయం 6గంటలకు హైదరాబాద్‌లోని తన ఇంటినుంచి బయలుదేరి బేగంపేట ఎయిర్‌పోర్టుకు వెళ్తారు. 6.30గంటలకు అక్కడ బయలుదేరి రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఉదయం 7.30 గంటలకు అక్కడ బయలుదేరి గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని తన నివాసానికి ఉదయం 9గంటలకు చేరుకుంటారు. తిరిగి 9.45 గంటలకు బయలుదేరి 10గంటలకు గొల్లప్రోలు పట్టణంలో సత్యకృష్ణ ఫంక్షన్‌హాలుకు చేరతారు. అక్కడ 12.30గంటల వరకూ జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పింఛన్లు పంపిణీ చేస్తారు. అనంతరం అక్కడినుంచి బయలుదేరి చేబ్రోలులోని నివాసానికి చేరుకుంటారు. భోజన విరామం తర్వాత మధ్యాహ్నం పిఠాపురం నియోజకవర్గ జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలతో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు.

రేపు శాఖలవారీగా సమీక్ష

2వతేదీన ఉదయం 9.30గంటలకు చేబ్రోలు నివాసం నుంచి బయలుదేరి 10గంటలకు కాకినాడ కలెక్టరేట్ చేరుకుంటారు. 10నుంచి 11గంటల వరకూ కలెక్టర్ కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల అధికారులతో, 11నుంచి 11.30గంటల వరకూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో, 11.30నుంచి 12గంటల వరకూ రోడ్ల పరిస్థితిపై పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో, 12గంటల నుంచి ఒంటి గంట వరకూ అటవీశాఖ అధికారులతో, ఒంటి గంట నుంచి రెండు గంటల వరకూ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అధికారులతో, అనంతరం సైన్స్ అండ్ టెక్నాలజీ అధికారులతో సమావేశమవుతారు. అక్కడినుంచి మధ్యాహ్నం 2.30గంటలకు చేబ్రోలు నివాసానికి చేరుకుంటారు. భోజన విరామం తర్వాత జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలతో సమావేశమవుతారు.

ఎల్లుండి బహిరంగసభ

3వతేదీన ఉదయం 10గంటలకు చేబ్రోలు నివాసం నుంచి బయలుదేరి కొత్తపల్లి మండలం ఉప్పాడ చేరుకుంటారు. 10.45గంటల నుంచి 12గంటల వరకూ సముద్రపు కోత ప్రాంతాన్ని పరిశీలిస్తారు. 12.45గంటలకు చేబ్రోలు నివాసానికి చేరుకుని పిఠాపురం నియోజకవర్గ అధికారులతో సమావేశమవుతారు. అనంతరం టీడీపీ, జనసేన ముఖ్యనేతలతో భేటీ ఉంటుంది. మధ్యాహ్నం 3.30గంటలకు చేబ్రోలు నుంచి బయలుదేరి పిఠాపురం పట్టణం ఉప్పాడ సెంటర్‌లో జరిగే వారాహి బహిరంగసభ వద్దకు చేరుకుంటారు. సాయంత్రం 6గంటలకు అక్కడినుంచి బయలుదేరి విజయవాడ వెళ్తారు.

డిప్యూటీ సీఎం పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒక డీఎస్పీతోపాటు 8మంది సీఐలు, 20మంది ఎస్ఐలు, 200మంది సిబ్బందిని బందోబస్తు నిమిత్తం నియమించారు. ఎనిమిది రోప్ పార్టీలను రంగంలోకి దించారు.

ఇసుక లోడింగ్ చేసినా, రవాణాకు పాల్పడినా

కఠిన చర్యలు తీసుకుంటాం

జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి ఎం.సుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం, జూలై 30(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నిమిత్తం జిల్లాలో ఏడు ఇసుక నిల్వల డిపోల్లో నిల్వ ఉంచిన ఇసుకను లోడింగ్ చేయడం, రవాణా చేయడం చట్టరీత్యా నేరమని అటువంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి ఎం. సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన



ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా లారీ ఓనర్లు, డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ఆదివారం లాలాచెరువు స్టాక్ పాయింట్ వద్ద 3 ప్రొక్లైనర్లు, ఒక లారీ, కడియపులంక వద్ద 5 ప్రొక్లైనర్లు ఒక లోడ్ లారీని సీజ్ చేసినట్టు ఆయన చెప్పారు. ఇసుక అక్రమ రవాణాపై నిరంతరం నిఘా ఉంచినట్లు సుబ్రహ్మణ్యం చెప్పారు. సిబ్బంది పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


ఇరిగేషన్ ప్రాజెక్టులను కలెక్టర్‌కు వివరిస్తున్న సర్కిల్ ఎస్ఈ

శివారు భూములకు సాగునీరు అందించండి

వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనే చర్యలు చేపట్టాలి

ఇరిగేషన్ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్ ప్రశాంతి

ధవళేశ్వరం, జూన్ 30: డెల్టాలోని శివారు ఆయకట్టు భూములకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించాలని అలాగే గోదావరి వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిస్థితిపై ఆదివారం ఆమె సమీక్షించారు. సాయంత్రం క్యాంపు కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరదలను ఎదుర్కొనడానికి తీసుకున్న ముందస్తు కార్యాచరణ, అత్యవసరంగా చేపట్టాల్సిన పనులు వాటికి కావాల్సిన నిధులు, వివరాలతో నివేదిక అందజేయాలని అధికారులను కోరారు. జిల్లాలో ప్రస్తుతం నీటి లభ్యత, సాగు, తాగునీటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. డ్రైన్‌లకు సంబంధించి నిర్వహణ వ్యవస్థపై సమీక్షించారు. పుష్కర, చాగల్నాడు, వెంకటనగరం, తొర్రిగడ్డ, పంపింగ్ స్కీంలకు చేపట్టాల్సిన పనులు అందుకు అవసరమైన నిధుల వివరాలను ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి

● రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్


అధికారులతో పర్యాటకంపై వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి దుర్గేష్, గండి పోశమ్మను దర్శించుకుంటున్న దుర్గేష్

దేవీపట్నం, జూన్ 30: పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం మంత్రి దుర్గేష్ దేవీపట్నం మండలంలో పోశమ్మగండిలో పర్యటించారు. పర్యాటక బోట్లపై గోదావరి పరివాహక ప్రాంతాలను సందర్శించారు. పాపికొండలు పర్యాటకంపై సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, రంపచోడవరం డీఎఫ్‌వో నరేంద్రన్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పర్యాటకులతో సైతం పాపికొండల విహారయాత్రపై మాట్లాడారు. అనంతరం మంత్రి దుర్గేష్ విలేకరులతో మాట్లాడుతూ సరైన నిబంధనలు పాటిస్తున్నారా, గతంలో జరిగిన ఘటనల పట్ల ఏవిధంగా జాగ్రత్త చర్యలు తీసుకుంటారో పరిశీలించడానికి రావడం జరిగిందన్నారు. మొత్తం 16బోట్లు ఉండగా రెండు టూరిజం డిపార్టుమెంటుకి చెందగా 14బోట్లు ప్రయివేట్ బోట్లన్నారు. సందర్శకులతో పర్యటనపై మాట్లాడగా అనుభూతి కలిగిందని చెబుతూ కొన్ని సదుపాయాలు కావాలని అడిగారన్నారు. పర్యాటకులకు అన్నిరకాల సదుపాయాలు ఏర్పాటుచేశామన్నారు. బోట్‌సేఫ్టీ విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నారు. గుడిసె ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని వివరించారు. అలాగే మంత్రి దుర్గేష్ మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సిబ్బంది స్వాగతంపలికి ఘనంగా సత్కరించి అమ్మవారిఫొటోను బహూకరించారు.

పోలవరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిన వైసీపీ ప్రభుత్వం

నిడదవోలు, జూన్ 30: వైసీపీ ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని దాంతో ప్రాజెక్ట్ పూర్తిగా పడకేసిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం నిడదవోలులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో సాక్షాత్తూ జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబబే పోలవరం ప్రాజెక్ట్ ఏంటో నాకే అర్థం కావడం లేదన్నారని, దీని ద్వారా గత ప్రభుత్వ విధానం ఏమిటో మనకు అర్థమవుతుందన్నారు. సీఎం చంద్రబాబు పోలవరం ప్రా జెక్టుపై శ్వేతపత్రం విడుదల చేశారని, గత ప్రభుత్వంలో ప్రాజెక్ట్ ఒక ఇంచ్ అభివృద్ధి కూడా జరగలేదని 2014-19 మధ్య సీఎం చంద్రబాబు హయాంలోనే అభివృద్ధి జరిగిందని, తిరిగి మళ్లీ ఇప్పుడు 2024-29 వరకు ఆయన హయాంలోనే పూర్తవు తుందన్నారు. గత ప్రభుత్వానికి కాఫర్‌డ్యామ్, డయాఫ్రమ్ వాల్ అంటే ఏంటో కూడా తెలియదన్నారు. ఇప్పుడు ప్రాజెక్టును పరుగులు పెట్టించడానికి అంతర్జాతీయస్థాయికి చెందిన సాంకేతిక నిపుణుల బృందం వచ్చిందన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు వైజాగ్, తిరుపతి, కడియం తదితర ప్రాంతాలపై దృష్టి సా రించామని దుర్గేష్ అన్నారు. వైసీపీ ప్రభుత్వం రబీలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిందని, ఎన్నికల పేరుతో రైతాంగానికి డబ్బులు ఇవ్వకుండా వెళ్లిపోయారన్నారు. కూటమి ప్రభుత్వం రైతు ప్రభుత్వమని రబీ ధాన్యం కొనుగోలు సొమ్మును రైతాంగానికి అందించేందుకు కేబినెట్ మీటింగ్‌లో చర్చించామని, అతి త్వరలోనే రైతులకు డబ్బులు అందిస్తామని మంత్రి దుర్గేష్ అన్నారు.



మారేడుమిల్లి ఎకో టూరిజంలో భారీ అవినీతి

మారేడుమిల్లి మండలంలోని సుందరమైన ప్రాకృతిక వనరులను ఎరగా వేసి ఎకో టూరిజం ముసుగులో రంపచోడవరం అటవీ డివిజన్లోని అధికారులు భారీ అవినీతికి పాల్పడ్డారు. ఎకో టూరిజం ప్రాజెక్టుల నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలు పాటించకుండా, కమిటీలను రద్దు చేసి కొత్త కమిటీలను నియమించకుండా లేని అధికారాన్ని తమకు తామే కట్టబెట్టుకుని ఎకో టూరిజం నిధులను కోట్లలో లావాదేవీలు సాగించేసి సానుకూలతల మేరకు అక్రమాలు, అవినీతికి పాల్పడిన భాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. పూర్వాపరాలు ఇలా ఉన్నాయి...

● లేని అధికారాన్ని కట్టబెట్టుకుని నిధులు డ్రా చేసిన అటవీ అధికార్లు
● సీసీఎఫ్ ఆమోదం లేకుండానే కోట్లాది రూపాయల లావేదేవీలు
● ఒక్క గుడిసె పర్యాటకం పేరుతోనే అనేక అక్రమాలు

(రంపచోడవరం)

అడవిలో ఉన్న పర్యాటక ప్రదేశాలను పర్యాటకులకు అనువుగా తీర్చిదిద్ది కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం(సి.బి.ఇ.టి) పేరుతో మారేడుమిల్లి మండలంలో వనవిహారి, జంగిల్ స్టార్, గుడిసె ప్రాంతాలను అటవీశాఖకు అనుబంధంగా రూపొందించారు. ఈ కేంద్రాలను పర్యావరణ హితంగా సి.బి.ఇ.టి.కమిటీల ద్వారా నిర్వహించడం, వచ్చిన ఆదాయాన్ని కమిటీలకు పంచడం, నిధులను పర్యావరణ పరిరక్షణకు వినియోగించడం, నిర్వహణా ఖర్చులు వంటి అంశాలకు నిబంధనలకు అనుగుణంగా నిధులను వెచ్చించాలి. అయితే ఈ నిధుల వెచ్చింపు అంశాన్నే ప్రాధాన్యంగా తీసుకుని అటవీ అధికారులు మొత్తం పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకుని అటవీ అధికారులు వ్యవహరించి భారీగా అవకతవకలకు పాల్పడ్డారు. ఒక్క గుడిసె ఎకోటూరిజం ప్రాజెక్టునే తీసుకుంటే అక్కడ కమిటీని రద్దుచేసి కొత్త కమిటీని నియమించకుండా దాని నిర్వహణను రంపచోడవరం డివిజనల్ అధికారి, మారేడుమిల్లిరేంజ్ అటవీ అధికారి కలిసి చేపట్టారు. కమిటీ పేరుతో ఉన్న బ్యాంకు ఖాతాను తామే నడిపి, నిధులను డ్రా చేసుకునే విధంగా డీఎఫ్‌వో తనకు తానే అధికారాన్ని కట్టబెట్టుకోవడం, తద్వారా మారేడుమిల్లి రేంజ్ అధికారితో కలిసి నిధులను విచక్షణా రహితంగా డ్రా చేయడం వివాదంగా మారింది. ఇక్కడ సుమారు రూ.3 కోట్లవరకూ బ్యాంకు నుంచి డ్రా చేసిన నిధులలో చాలా వరకూ నిధులకు సరైన లెక్కలు లేవని సమాచారం.

రాజమహేంద్రవరం చీఫ్ కన్జర్వేటర్ అనుమతులు లేకుండానే తనకు తానుగా అధికారాన్ని కట్టబెట్టుకుని నిధుల లావేదేవీలకు పాల్పడటాన్ని ఇటీవల జరిగిన ఎకౌంట్స్ అధికారి పరిశీలనలో తూర్పారబెట్టారు. నిబంధనల ప్రకారం బ్యాంకు ఖాతాల్లో 50శాతం నిధులను ఉంచి తీరాలన్న అంశాన్ని కూడా ఉల్లంఘించడం, ఎకో టూరిజం నిధులను కార్యాలయాలు, నివాసాల, వాహనాల పనుల కోసం వెచ్చించడం వంటి అంశాలను గుర్తించిన సీసీఎఫ్ శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. ఈ పరంపరలో శాఖాపరమైన విజిలెన్సు ఉన్నతాధికారి ఎకో టూరిజం ప్రాజెక్టులను పరిశీలించి తీగలాగి మొత్తం అక్రమాల డొంకను కదుపుతున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి కార్యాచరణ ప్రణాళికలూ లేకుండా చేసిన ఖర్చులే వివాదంగా మారగా, మరో ప్రక్క రూ.50లక్షల నుంచి కోటి రూపాయలలోపు ఖర్చులకు సరైన లెక్కలు లేవని అటవీశాఖలోనే చర్చ సాగుతోంది. ఇదిలావుండగా ఇప్పటికే మారేడుమిల్లి అడవుల్లో చోటుచేసుకున్న అనేక అక్రమాలపై ప్రభుత్వం వద్ద చర్యలకు ఫైళ్లు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో ఈ ఎకో టూరిజం భాగోతం కూడా దానికి తోడై పవన్‌కళ్యాణ్ సారథ్యంలో ఉన్న అటవీశాఖ ఎటువంటి చర్యలను తీసుకుంటుందో చూడాలి.

హోం మంత్రి ఓఎస్డీగా అడిషనల్ ఎస్పీ అనిల్‌కుమార్



రాజమహేంద్రవరం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఏపీ హోం మంత్రికి ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ(ఓఎస్డీ)గా తూర్పుగోదావరి జిల్లా శాంతిభద్రతల అడిషనల్ ఎస్పీ పి.అనిల్‌కుమార్ నియమితులయ్యారు. ఎస్‌ఐబీ ఇంటెలిజెన్స్ అడిషనల్ ఎస్పీగా బదిలీ చేస్తూ హోంమంత్రి వంగలపూడి అనితకు ఓఎస్డీగా నియమిస్తూ ఆర్‌సీ నెం.677/జీ2/2024 ద్వారా ఆదివారంరాత్రి డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. అనిల్ విశాఖ జిల్లాకు చెందినవారు. అందువల్ల పాడేరు అడిషనల్ ఎస్పీగా పనిచేస్తూ ఎన్నికల సందర్భంగా ఫిబ్రవరి 13న జిల్లాకు వచ్చారు. 2012 గ్రూప్-1 అధికారి అయిన అనీల్‌కుమార్‌కి సమర్థవంతమైన అధికా రిగా పేరుంది. జిల్లాలోని ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణలో కీలకపాత్ర పోషించారు. కాగా, బదిలీపై ప్రభుత్వ ఆదేశాలు(జీవో) జారీ కావాల్సి ఉంది. దీంతో ఒకటి రెండు రోజుల్లో ఆయన జిల్లా నుంచి రిలీవ్ అయ్యి నూతన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఎస్పీ జగదీశ్, అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

పాదగయ ఈవోగా దుర్గాభవానీ


పాదగయ ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న దుర్గాభవానీ

పిఠాపురం, జూన్ 30: కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో ఉన్న కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనర్‌గా ఏవీ దుర్గాభవానీ ఆదివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈమె రాజమహేంద్రవరం దేవదాయశాఖ ఆర్‌జేసీ కార్యాలయంలో జ్యువలరీ వెరిఫిషన్ ఆఫీసరుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటివరకూ పాదగయ ఈవోగా పనిచేసిన ఏసీ పులి నారాయణమూర్తి రిటైర్డ్ కావడంతో దుర్గాభవానీకి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ దేవదాయశాఖ కమిషనరు సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పాదగయకు వచ్చిన ఆమె కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూ జలు నిర్వహించారు, అనంతరం బాధ్యతలు స్వీకరించారు. ఈవోను ఆలయ సిబ్బంది, అర్చకు లు కలుసుకుని అభినందనలు తెలియజేశారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే పాదగయ పరిసరాలను పరిశీలించారు. భక్తులు, దాతలకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిబ్బంది అందరూ తప్పనిసరిగా యూనిఫారమ్ ధరించాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భక్తులతో గౌరవంగా, మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు.

10 వేల సత్యదీక్షల పుస్తకాలు వితరణ


సత్యదీక్షల పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ఈవో, తదితరులు

అన్నవరం, జూన్ 30: హైదరాబాద్‌కు చెందిన గోవిందమాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అచ్చువేయించిన సత్యదీక్షల పుస్తకాలను ఆదివారం దేవస్థానం ఈవో కె.రామచంద్రమోహన్ ఆవిష్కరించారు. ప్రతీ ఏటా ఆశ్వీయుజ మాసంలో వచ్చే మఖ నక్షత్రం రోజు నుంచి కార్తీకమాసంలో వచ్చే మఖ నక్షత్రం రోజువరకు భక్తులు సత్యదీక్షలు స్వీకరిస్తుంటారు. ఈఏడాది వారికి ఉచితంగా సత్యదీక్షల పుస్తకాలు అందించాలని సుమారు 10వేల పుస్తకాలను దేవస్థానం ఈవో కు ఫౌండేషన్ సభ్యులు అల్లం సాయికుమార్, గుంటుకు రామకృష్ణలు అందించారు. ఈసందర్భంగా ఫౌండేషన్ సభ్యులను ఈవో అభినందించారు.

సత్యదేవుడికి హైకోర్టు న్యాయమూర్తి పూజలు


హైకోర్టు న్యాయమూర్తికి సత్యదేవుడి మెమెంటో అందజేస్తున్న ఈవో

అన్నవరం, జూన్ 30: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ.వి.రవీంద్రబాబు స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు చేశారు. ఆయనకు ఆలయ ఈవో రామచంద్రమోహన్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా ఈవో వారికి స్వామివారి మెమెంటో, ప్రసాదం అందించారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు పాల్గొన్నారు.

లోవకు పోటెత్తిన భక్తులు

● ఆలయానికి రూ.6.77లక్షల ఆదాయం



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

తునిరూరల్, జూన్30: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తజనంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించిన ఆలయ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దేవస్థానం ఏర్పాటుచేసిన క్యూలైన్‌లో భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ఏర్పాటుచేసిన వసతి గదులు, వంట షెడ్లల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.6.77లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో విశ్వనాధ్‌రాజు తెలిపారు.

జూలై 1 స్పెషల్..

నేడు ఎన్నెన్ని 'రోజు'లో.. అన్నీ ప్రత్యేకమే..!



డాక్టర్ బీసీ రాయ్ పేరిట విడుదల చేసిన పోస్టల్ స్టాంపు



చార్టెడ్ అక్కౌంటెంట్స్ డే

అమలాపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవితంలో ప్రతి రోజుకూ ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. అయితే కొన్ని రోజులకు మాత్రం జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ప్రత్యేకతలుంటాయి. మనిషి జీవితంలో 'పుట్టినరోజు'కు ఎనలేని ప్రత్యేకత ఉంటుంది. అలాగే సంస్థలకు, సంఘాలకు, వ్యక్తులకు కూడా కొన్ని ప్రత్యేక రోజులుంటాయి. అటువంటి ప్రత్యేకత కలిగిన రోజులలో జూలై 1ని ప్రత్యేకంగా చెప్పుకోవాలి. జూలై 1 అనగానే గ్రామీణ ప్రాంత వైద్యుల నుంచి అంతర్జాతీయస్థాయిలో కీర్తినార్జించిన డాక్టర్ల వరకూ అంతా 'వైద్యుల దినోత్సవం'గా జరుపుకుంటారు. డాక్టర్ బీసీ రాయ్ జయంతిని డాక్టర్స్ డేగా ఏటా నిర్వహించుకుంటున్నారు. రెండు ప్రధానమైన బ్యాంకులను జూలై 1నే ప్రారంభించారు. కెనరా బ్యాంకును 1906 జూలై 1న ప్రారంభించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను 1955 జూలై 1నే స్థాపించారు. దాంతో ఈ రెండు బ్యాంకులు ఈ రోజును వ్యవస్థాపక దినోత్సవంగా జరుపుకుంటు న్నాయి. ఎంత పెద్ద సంస్థలకైనా, వ్యాపారాలకైనా ఖచ్చితమైన లెక్కలుం డాలి. లెక్కతప్పిందా అంతే సంగతులు. అందుకే అంకెల మాంత్రికులుగా పేరొందిన చార్టెర్డ్ అకౌంటెంట్స్ లేకుండా వ్యాపారాల లెక్కలు మాత్రం తేలవు. ఇటువంటివారికి కూడా ఒక రోజుండండోయ్. అదే 'చార్టెర్డ్ అకౌంటెంట్స్ డే'. 1949 జూలై 1న చార్టెర్డ్ అకౌంటెంట్లను స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థగా ఏర్పాటుచేశారు. అప్పటి నుంచి చార్టెర్డ్ అకౌం టెంట్స్ డే నిర్వహిస్తున్నారు. భవన నిర్మాణాల రూపకర్తలైన ఆర్కిటె క్చర్లకు ఒక ప్రత్యేకమైన రోజుంది. ఆధునిక కాలంలో ఆర్కిటెక్చర్లకు అంతర్జాతీయంగా గుర్తింపు లభించింది. అందమైన గృహాలు, కట్టడాలు నిర్మించుకునేందుకు జనం పోటీపడుతుండడంతో ఆర్కిటెక్చర్లకు డిమాండు పెరిగింది. అలాగే ప్రతిఏటా జూలై 1న ఆర్కిటెక్చర్స్ డేను నిర్వహించుకుంటారు. ఇన్ని ప్రత్యేకతలు కలిగిన ఈ రోజుకు మరికొన్ని విశేషాలు ఉన్నాయి. ఇండియాలో తొలిసారిగా పోస్టు కార్డును జూలై 1నే ప్రవేశపెట్టారు. రోదసిలో మృతి చెందిన ప్రముఖ వ్యోమగామి కల్పనా చావ్లా జయంతి కూడా ఇదే రోజు. అదండీ.. జూలై 1కి ఇన్ని ప్రత్యేకతలున్నాయి.

ఉన్నత విద్యలతోపాటు సమాజంలోని మార్పులు ఆకళింపు చేసుకోవాలి

● ఆర్యవైశ్య మెరిట్ విద్యార్థుల సన్మాన సభలో ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం


విద్యార్థికి ప్రతిభా అవార్డు అందజేస్తున్న శ్రీఘాకోళ్ళపు శివరామ సుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం, జూన్ 3)(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యను అభ్యసించడంతోపాటు సమాజంలోని మార్పులు గమనిస్తూ, అన్ని అంశాలను ఆకళింపు చేసుకుని ఆయా రంగాలలో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆర్యవైశ్య విద్యార్థులకు ఏపీ ఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్ళపు శివరామ సుబ్రహ్మణ్యం ఉద్బోధించారు. స్థానిక లాలాచెరువులోని ఆర్యవైశ్య హాస్టల్‌లో ఆదివారం ఆర్యవైశ్య అఫిషియల్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్మీడియట్ నుంచి ట్రిపుల్ ఐటీ వరకూ వివిధ స్థాయిలలో ఉత్తమ ఫలితాలు సాధించిన 60 మంది ఆర్యవైశ్య విద్యార్థులకు అవార్డుల ప్రదానం సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అసోషియేషన్ అధ్యక్షుడు పి. రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈసభలో విద్యార్థులకు ప్రతిభా అవార్డులను అందజేశారు. గుంటూరు రెమాండ్స్ మెన్స్ టచ్ మేనేజింగ్ పార్టనర్ టి. అరుణకుమార్, పువ్వాడి చంద్రశేఖర్, పి.కనకరాజు, ఆర్. సుబ్బారావు, ఈ. శంకరనారాయణ, వి.నాగమణి, కేవీ గోపాలకృష్ణ, కె.కనకేశ్వరరావు, ఎం. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● ఆర్యవైశ్య సంఘం ఉమ్మడి తూర్పు అధ్యకుడిగా మళ్లీ కంచర్ల బాబి ఏకగ్రీవం



ఆర్యవైశ్య సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా కంచర్ల బాబీ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సుమారు 300 మంది ప్రతి నిధులు ఈసభలో పాల్గొన్నారు. శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, ఆర్య వైశ్య రాష్ట్ర అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయులు తదితరులు బాబిని అభినందించారు. రాష్ట్రంలో ఆర్యవైశ్యులు రెండుగా వర్గాలుగా ఉండడం వల్ల వారిని ఐక్యం చేయవలసిన అవసరం ఉందని ప్రధానవక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. రెండురోజులలో హైదరాబాద్‌లో చర్చలు మొదలు కానున్నట్టు తెలిపారు.

ఎస్పీ అంటూ బురిడీ

రూ.2.35లక్షలు స్వాహా

రాజమహేంద్రవరం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఎస్పీనని చెప్పి ఓ వ్యక్తిని బురిడీ కొట్టించి డబ్బులు దోపిడీ చేయడంపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మునిసిపల్ కాలనీకి చెందిన ఎస్.పామ్‌రాజ్‌కి గత నెల 17న ఓ ఫోన్‌కాల్ వచ్చింది. నీ బ్యాంకు ఖాతాలో రూ.3కోట్లు జమ అయ్యాయి. అవి ఎక్కడి నుంచి వచ్చాయి. మనీ లాండరింగ్ కేసులో నీ పేరు ఉంది. ఢిల్లీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని బెదిరించారు. కాసేపటికి ఢిల్లీ నుంచి ఎస్పీని మాట్లాడుతున్నానంటూ ఓ వ్యక్తి వాట్సాప్ కాల్ చేశారు. నీకు అంత మొత్తంలో డబ్బు ఎందుకు వచ్చిందంటూ ప్రశ్నించాడు. పామ్‌రాజ్ చెప్పిన సమాధానంతో ఏకీభవించలేదు. నువ్వు నాకు సహకరిస్తే కేసు లేకుండా చేస్తానని అవతల వ్యక్తి చెప్పాడు. మాటల్లోనే పామ్‌రాజ్ బ్యాంకు ఖాతా వివరాలు తీసుకున్నాడు. ఎస్పీ అనే వ్యక్తి చెప్పిన ప్రకారం రూ.50వేలు, రూ.లక్ష జమ చేశాడు. మళ్లీ అవతల వ్యక్తి ఫోన్ చేసి పెద్ద మొత్తం డిమాండ్ చేయగా.. తన ఖాతాలో రూ.85వేలు మాత్రమే ఉన్నాయంటూ ఆ డబ్బులు కూడా బదిలీ చేశారు. ఇలా మొత్తం రూ.2.35లక్షలు పంపించాడు. తర్వాత అటు వైపు నుంచి ఫోన్ రాలేదు. దీంతో అనుమానించిన పామ్‌రాజ్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారి సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఇలాంటి ఫోన్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫోన్ వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. భయంతో లేదా అత్యాశతో మోసపోవద్దని ఆయన కోరారు.

సంతానం కలగడం లేదని ఆత్మహత్య

● కాలువలో దూకిన వివాహిత

ఉండ్రాజవరం, జూన్ 30: సంతానం కలగడంలేదని మనస్తాపం చెందిన ఒక మహిళ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన దమ్మెన్నులో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మోర్త గ్రామానికి చెందిన తోట రాశి(24)కి 2020లో ఉండ్రాజవరం గ్రామానికి చెందిన దుర్గారావుతో వివాహమైంది. నాలుగేళ్లయినా సంతానం కలగకపోవడంతో మనస్తాపం చెంది శనివారం దమ్మెన్ను గ్రామం వద్ద నరసాపురం కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతదేహం ఆదివారం లభ్యమయ్యింది. ఆమె తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఉండ్రాజవరం పోలీసులు తెలిపారు.

డిప్యూటీ డీఎంఅండ్‌హెవోపై విచారణ జరపాలి

ఎటపాక, జూన్ 30 : చింతూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్యపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని వైఎస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు డిమాండ్ చేశారు. డాక్టర్ పుల్లయ్య డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విలీన మండలాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులు, బర్త్ వెయిటింగ్ హాల్స్‌కోసం మంజూరీచేసిన నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. డాక్టర్ పుల్లయ్య తెలంగాణలోని భద్రాచలంలో ఓ ప్రయివేట్ ఆసుపత్రి నడుపుతూ, ఆశ, ఏఎన్‌ఎంల సాయంతో రోగులను అక్కడికి తరలిస్తుంటారని ఆరోపించారు. త్వరలో స్థానిక ఎమ్మెల్యే శిరీషాదేవితో కలిసి పుల్లయ్యపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. ఈవిషయమై డాక్టర్ పుల్లయ్యను వివరణ కోరగా వైఎస్ ఎంపీపీ తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు.

ట్యాంకర్ ఢీకొని తాత, మనవడు మృతి


సంఘటనా స్థలంలో పడివున్న తాతా, మనవడిల మృతదేహాలు


మాసా వీర్రాజు, పాముల ధనుష్ చంద్ర (ఫైల్)

కొవ్వూరు, జూన్ 30: మోపెడ్‌ను లారీ ఢీకొన్న ఘటనలో తాత, మనువడు మృతిచెందినట్టు సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. కొవ్వూరులోని శ్రీరామకాలనీకి చెందిన మాసా వీర్రాజు (44) ఆదివారం కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో ఉన్న కుమార్తె ఇంటికి భోజనానికి వెళ్లాడు. తిరిగి స్వగ్రామం వస్తూ ఆరో తరగతి చదువుతున్న మనవడు పాముల ధనుష్‌చంద్ర(11)ను తీసుకుని మోపెడ్‌పై బయలుదేరారు. ఆరికిరేవుల గ్రామంవద్ద గోదావరి ఏటిగట్టు రోడ్డుపై ఎదురుగా వస్తున్న ట్యాంకరు ఢీకొనడంతో ఇద్దరు కింద పడిపోయారు. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడ మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు ధనుష్ చంద్ర తండ్రి పాముల సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

డివైడర్‌ను కారు ఢీకొని ఒకరి మృతి

మరో ఘటనలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఒకరు మృతి చెందినట్టు సీఐ తెలిపారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం (అంకంపాలెం)లోని పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గండికోట ఎస్‌వీ జోగినాథం(28) ఈనెల 29న కారులో రాజమహేంద్రవరం షాపింగ్‌కు వచ్చాడు. షాపింగ్ పూర్తిచేసుకుని కల్కి సినిమా సెకండ్ షో చూసి తిరిగి జంగారెడ్డిగూడెం వెళ్తుండగా అర్ధరాత్రి కొవ్వూరులోని ఏబీఎన్, పీఆర్‌ఆర్ డిగ్రీ కాలేజీ సమీపంలో కుక్క అడ్డురావడంతో సడన్‌బ్రేక్ వేశాడు. దీంతో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో జోగినాథానికి తీవ్రగాయాలై పడి ఉన్నాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఓ డాక్టర్ ఆయనను పరిశీలించి మృతి చెందినట్టు చెప్పారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి గండికోట శ్రీరామ సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ జుబేర్ మహ్మద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఏజెన్సీలో భారీ వర్షం

● నెల్లిపాక ప్రధాన రహదారిపై కూలీన భారీ వృక్షం
● ఆరేడు గంటలపాటు స్తంభించిన రాకపోకలు


రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్లను యంత్రాలతో తొలగిస్తున్న దృశ్యం



భారీవృక్షం రహదారిపై పడడంతో నిలిచిపోయిన వాహనాలు

ఎటపాక, జూన్30: ఏజెన్సీలోని ఎటపాక మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఎడతెరిపిలేని వర్షం కురిసింది. శనివారం అర్ధరాత్రి సమ యంలో భారీ వర్షంపడడంతో కుంటలు, చెరువులు నిండాయి. వాగులు పొంగిపొర్లాయి. వర్షం దాటికి నెల్లిపాక సమీపంలో భద్రాచలం-కూనవరం రోడ్‌లో భారీ వృక్షం నెలకూలింది. దాంతో ఆదివారం తెల్లవారుజాము నుంచి సుమారు ఆరేడు గంటల పాటు ఈ రహదారిపై రాకపోకలు స్తంభించాయి.

ఏజెన్సీ సమాచారం

నేడు మన్యంలో పింఛన్ల పండగ

- 11 మండలాల్లో 30,076 మంది లబ్ధిదార్లకు రూ.20.46 కోట్ల పంపిణీ
- టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు

రంపచోడవరం, జూన్30: తెలుగుదేశం ప్రభుత్వం సోమవారం అందజేసే సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మన్యంలో తెలుగుదేశం నాయకులు సంబరంగా నిర్వహిస్తున్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష సూచనలతో ప్రతి మండలంలోనూ ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పెద్దఎత్తున పాల్గొని లబ్ధిదార్లకు భరోసా కల్పించే దిశగా ఏర్పా ట్లు చేశారు. 11 మండలాలలో 90 గ్రామ సచివాలయాల పరిధిలో 30,076 మంది లబ్ధిదారులకు రూ.20.46 కోట్లను పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆయా లబ్ధిదార్ల ఇళ్ల వద్దనే ఈ పింఛన్ల పంపిణీ కోసం 1070 మంది సచివాలయ సిబ్బందిని సిద్ధం చేశారు.

ప్రతి కార్యకర్త పెన్షన్ పంపిణీలో పాల్గొనాలి : ఎమ్మెల్యే శిరీష

రాజవొమ్మంగి జూన్ 30: సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి లబ్ధిదారుల ఇంటికి సచివాలయ సిబ్బంది వెళ్లి పెన్షన్ పంపిణీ చేయనున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి అన్నారు. రంపచోడవరం నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పెన్షన్ పంపిణీలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆమె సూచించారు.

6522మందికి పెన్షన్ పంపిణీ : ఎంపీడీవో

రాజవొమ్మంగి మండలంలో 6522 మంది లబ్దిదారులకు జూలై ఒకటిన పెన్షన్ పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేశామని రాజవొమ్మంగి ఎంపీడీవో యాదగిరేశ్వరావు అన్నారు. 6522మంది లబ్దిదారులకుగాను రూ.4కోట్ల 42లక్షల రెండువేల ఐదు వందల రూపాయలను మండలంలో 132మంది ఉద్యోగులు పంపిణీ చేయనున్నారని, 132మంది ఉద్యోగుల్లో 129మంది సచివాలయ ఉద్యోగులు ఉండగా ముగ్గురు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఉన్నారన్నారు. మండలంలో 7 క్లస్టర్ సూపర్వైజర్‌లు పెన్షన్ పంపిణీని నిరంతరం పర్యవేక్షించి సమస్యలు ఉంటే ఉన్నాతాధికారులకు నివేదించనున్నారని ఎంపీడీవో తెలిపారు.

పింఛన్ల పంపిణీ పారదర్శకంగా జరగాలి

వై.రామవరం, జూన్ 30: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పారదర్శకంగా జరపాలంటూ ఎంపీడీవో కె.బాపన్నదొర సిబ్బందిని ఆదేశించారు. నేటి ఉదయం 6గంటల నుంచి మండలంలో అన్ని పంచాయతీల్లో ఇంటింటికి పింఛన్లు అందించాలని తెలిపారు. పింఛన్ల పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరిగిన జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవోలకు ఫిర్యాదు చేస్తామన్నారు. పింఛన్‌దారులు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, మండల విద్యాశాఖాధికారి, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ, ఉపాధి ఏపీవోలను ప్రత్యేక సూపర్‌వైజర్లుగా నియమించినట్లు ఎంపీడీవో తెలిపారు.

ఎమ్మెల్యే శిరీషకు సత్కారం



ఎమ్మెల్యే శిరీషను సత్కరిస్తున్న గ్రామస్థులు

రాజవొమ్మంగి జూన్ 30: ఆదివారం మండలంలోని చాలా గ్రామాల్లో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, ఆమె భర్త తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్‌కు ఘన స్వాగతం లభించింది. పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సన్మాన సభల్లో ఎమ్మెల్యే దంపతులను గ్రామస్థులు సన్మానించారు. తమ మండలానికి చెందిన యువతి ఎమ్మెల్యేగా గెలుపొందడం తమకు గర్వకారణం అంటూ ప్రజలు కొనియాడానేజ తంటికొండ గ్రామంలో వాటర్ ట్యాంక్ నిర్మించాలని, గింజర్తి గ్రామంలో రామాలయం నిర్మాణానికి సాయం అందించాలని, సీసీ రోడ్లు నిర్మించాలని, తంటికొండ - గింజర్తి గ్రామాల మధ్యలో బ్రిడ్జ్ నిర్మించాలని స్థానిక నాయకులు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ సొంత మండలంలో ప్రజలు తన విజయానికి ఇంతలా కృషి చేస్తారని ఊహించలేదని, రాజవొమ్మంగి మండలాన్ని అభివృద్ధి చేస్తూ రంపచోడవరం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. గింజర్తి గ్రామంలో రామాలయ నిర్మాణానికి లక్ష రూపాయలు ఇస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

కార్పొరేట్ బ్రాండ్ మొక్కజొన్నతో ఉపాధి కరువు

- సీపీఎం మండల కార్యదర్శి ఐవీ

ఎటపాక, జూన్ 30 : కార్పొరేట్ బ్రాండ్ మొక్కజొన్న సాగుతో విలీన మండలాల్లో కూలీలకు ఉపాధి దొరకని పరిస్థితి ఏర్పడుతుందని, వెంటనే విలీన మండలాల్లో ఒప్పందం కౌలుతో సాగుచేస్తున్న మొక్క సాగును ఆపేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఎటపాకలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే కూనవరం, వీఆర్‌పురం మండలాల ప్రజలు కూలి పనులు దొరక్క, ఎటపాక మండలానికి వస్తున్నారని, మొక్కజొన్న సాగుతో ఆ కాస్త ఉపాధి లేకుండా పోతుందన్నారు. ఇప్పటికే విలీన మండలాల్లో రైతులు మిర్చి సాగుచేయలేని పరిస్థితి ఉందన్నారు. దీన్ని ఆసరాగా తీసుకుని మొక్కజొన్న బ్రాండ్ నిర్వాహకులు తక్కువ కౌలుతో భూములను తీసు కుంటున్నారని తెలిపారు. మొక్కజొన్న సాగు విస్తరిస్తే కూలీలకు కనీసం పనులు ఉండని, కరువు పరిస్థితులు ఏర్పడతాయని అన్నారు. ఈకార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఆకిశెట్టి రాము, డేగల మాధవరావు, గద్దల హుస్సేన్, పులుసు బాలకృష్ణ పాల్గొన్నారు.

బిచ్చగాడికి కొవిడ్ సైనిక్ టీమ్ అంత్యక్రియలు



రంపచోడవరం, జూన్30: రంపచోడవరంలో డిస్పోజబుల్ సత్తిబాబు అనే బిచ్చగాడు ఆకస్మిక మరణంతో అనాథ అయిన అతడి మృతదేహానికి రంపచోడవరంలోని కొవిడ్ సైనిక్ టీమ్ అంత్యక్రియలు నిర్వహించింది. ఇతడు గతకొన్నేళ్లుగా రంపచోడవరంలో భిక్షాటన చేసుకుని జీవించేవాడు. బిచ్చమెత్తుకుంటూనే అందరికీ సుపరిచితంగా ఉండే ఇతడి అకాల మరణం పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం అతడి మృతదేహాన్ని కొవిడ్ సైనిక్ టీమ్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. నాగబాబు, మసీదు కమిటీ ఛైర్మన్ గౌస్ మొహిద్దీన్, పీరు సాహెబ్, సాయిబాబా ఆలయ పూజారి అద్దంకి వెంకటేశ్వరరావు, వాడ్రేవు వాసు, టీ స్టాల్ భద్రం తదితరులు ఈ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.


మంత్రి లోకేశ్‌ను కలిసిన మల్లికార్జున్



మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన మల్లికార్జున్

వరరామచంద్రాపురం, జూన్ 30 : టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మంత్రి నారా లోకేష్‌ను వీఆర్‌పురం, మాజీ మండల అధ్యక్షుడు జంగాల మల్లికార్జున్ మర్యాద పూర్వకంగా విజయవాడలోని పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ముంపు మండలాల సమస్యల ను వారి దృష్టికి తీసుకెళ్లారు. పోలవరం ప్రాజెక్టు కోసం సర్వస్వం కోల్పోతున్న పోలవరం నిర్వాసితులకు తగిన న్యాయం చేయాలని కోరారు. అందుకు వారు సానుకూలంగా స్రందించారని ఆయన తెలిపారు.

వరుస దొంగతనాలపై సమగ్ర విచారణ జరపాలి



వరరామచంద్రాపురం, జూన్ 30 : పవిత్ర పుణ్యక్షేత్రమైన వీఆర్‌పురం మండలంలోని శ్రీరామగిరి గ్రామంలోని శ్రీసుందర సీతారామస్వామివారి ఆలయంలో జరుగుతున్న వరుస దొంగతనాలపై సమగ్ర విచారణ చేపట్టాలని జడ్పీటీసీ సభ్యుడు వాళ్ళ రంగారెడ్డి, మండల అధ్యక్షుడు ఆచంటి శ్రీనివాస్ కోరారు. ఆదివారం వీఆర్‌పురంలో జరిగిన పార్టీ సమావేశంలో వారు మాట్లాడుతూ సుమారు 13సంవత్సరాల క్రితం (2006లో) స్వామివారి విగ్రహాలు అపహరణకు గురయ్యాయి. 2020లో రెండవసారి, మూడురోజుల క్రితం మూడవసారి దొంగతనం జరిగింది. ఈదొంగతనాలపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల టీడీపీ కమిటీ వారు కోరుతున్నారు. సీనియర్ నాయకులు ముత్యాల రామారావు, బొర్ర నరేష్‌కుమార్ బీరక సూర్యప్రకాష్‌రావు, ముత్యాల సిద్ధు, ముత్యాల రమేష్, పెందుర్తి సుదర్శన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భూలోకమ్మను దర్శించుకున్న బత్తుల వెంకటలక్ష్మి

కోరుకొండ, జూన్ 30: మండలంలోని పశ్చిమగోనగూడెంలో భూలోకమ్మ జాతర ఆదివారం ఘనంగా ముగిసింది. అమ్మవారిని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సతీమణి వెంకటలక్ష్మి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు సర్పంచ్ రొంగల దేవిక, శ్రీనివాస్, ఆలయ కమిటీ ఘనంగా స్వాగతం పలికింది. అలాగే రాఘవాపురంలో ఆంజనేయస్వామి వార్షికోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ముండ్రు సంధ్యారాణి, గాంధీ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జంబుపట్నంలో గ్రామదేవత గొడుగులమ్మ జాతర ఆదివారం వైభవంగా సాగింది.

డయేరియా నియంత్రణే లక్ష్యం

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్ ప్రశాంతి
- ఈలకొలను శివారు అచ్యుతాపురంలో పర్యటన
- డయేరియా బాధితులకు పరామర్శ.. అధికారులకు సూచనలు



రంగంపేట: అచ్యుతాపురంలో పర్యటిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రంగంపేట, జూన్ 30: జిల్లాలో డయేరియా నియంత్రణే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఒక్క డయేరియా కేసు కూడా నమోదు కాకుండా ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలన్నారు. మండలం ఈలకొలను గ్రామ శివారు అచ్యుతాపురంలో ఆదివారం ఆమె పర్యటించి డయేరియా బాధితులను పరామర్శించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రతిరోజూ తాగునీటి శాంపిల్స్ పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లాలో మెరుగైన శానిటేషన్ లక్ష్యంగా పంచాయతీ, పురపాలక సంఘం అధికారులు పనిచేయాలన్నారు. ఐదేళ్ల లోపు పిల్లల ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డయేరియా లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుల సలహాలతో చికిత్స తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. డయేరియా నియంత్రణపై పటిష్టమైన కార్యాచరణ, ప్రణాళిక అమలు చేయాలని వైద్యఆరోగ్యశాఖ సమన్వయశాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వీరికి సకాలంలో మందులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. అనంతరం అచ్యుతాపురంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణ, పరిసరాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని, గ్రామంలో ఉన్న రక్షిత మంచినీటి ఓవర్‌హెడ్‌ట్యాంక్, మంచినీటి పైపులైన్లను కలెక్టర్ పరిశీలించారు. పంచాయతీ అధికారులు తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకలను క్లోరినేషన్ చేయాలన్నారు. అచ్యుతాపురం చుట్టుపక్కల ఆరు గ్రామాల్లో తాగునీరు శాంపిల్స్‌ను తీసుకొని పరీక్షలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే అచ్యుతాపురంలో మరో వారం రోజులు పాటు మెడికల్ క్యాంప్ నిర్వహించాలని వైద్యాధికారులకు సూచించారు. జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు 'స్టాప్ డయేరియా క్యాంపెయిన్' కార్యక్రమం ద్వారా ప్రజలకు డయేరియా నియంత్రణ పట్ల అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, ఆర్డీవో ఎ.చైతన్యవర్షిణి, జిల్లా సర్వే అధికారి డాక్టర్ రాజీవ్, రంగంపేట తహశీల్దార్ లతీఫ్ పాషా, ఎంపీడీవో బి.శ్రీరామరాజు, పీహెచ్‌సీ వైద్యులు వేణుశ్రీలక్ష్మీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

రాజానగరం ఎంపీడీవో కార్యాలయానికి కలెక్టర్..

రాజానగరం, జూన్ 30: జిల్లా కలెక్టరుగా బాధ్యతలు స్వీకరించిన పి.ప్రశాంతి ఆదివారం అకస్మాత్తుగా రాజానగరం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. సెలవుదినం కావడంతో ఉద్యోగులెవరూ అందుబాటులో లేకపోవడంతో, తాళం వేసి ఉన్న కార్యాలయాన్ని సెల్‌ఫోన్‌లో ఫొటో తీసుకుని వెంటనే వెనుదిరిగారు. విధి నిర్వహణలో భాగంగా రంగంపేట మండలం అచ్యుతాపురం వెళ్లిన కలెక్టర్ తిరిగి వస్తూ మార్గమధ్యలో రాజానగరం ఎంపీడీవో కార్యాలయానికి విచ్చేశారు. ఎన్టీఆర్ భరోసా కార్యక్రమంలో భాగంగా సోమవారం పింపిణీ చేసే సామాజిక పింఛన్లకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేసేందుకు వచ్చినట్లు కార్యాలయ ఉద్యోగులు తెలిపారు.

డయేరియాతో అప్రమత్తంగా ఉండండి: ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 30: రాజమహేంద్రవరంలో డయేరియా కేసులు నమోదు కానప్పటికీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు. ఆదివారం నగరపాలక సంస్థ వైద్య విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. డయేరియా పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని, దాని లక్షణాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా చూసుకోవాలన్నారు. ఆస్పత్రిలో ఓ వార్డు కేటాయించినట్టు తెలిపారు. ఎంహెచ్‌వో మాట్లాడుతూ హెల్త్ సెక్రటరీలు, శానిటరీ సెక్రటరీలతో నగరంలో ప్రతి డివిజన్‌లో 200 ఇళ్లు చొప్పున సర్వే చేయిస్తున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.

బుర్రిలంకలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

కడి యం, జూన్ 30: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆలోచన విధానం దేశంలో పేదరిక నిర్మూలనేనని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని బుర్రిలంక జాతీయరహదారి సమీపంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు నివాళులర్పించారు. దళిత నాయకుడు వారా రాము అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ దేశంలో ప్రజల మధ్య అసమానతలు తొలగిపోయి, పేదరిక నిర్మూలన కావాలని అంబేడ్కర్ కోరుకున్నారన్నారు. చట్ట సభల నుంచి విద్యా, ఉద్యోగ అవకాశాల వరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ఈరోజున రిజర్వేషన్లు పొందగలుగుతున్నారంటే అందుకు ఆయనే కారణమని కొనియాడారు. కార్యక్రమంలో పాటంశెట్టి రాంజీ, మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి నాని, పంతం గణపతి, గట్టి సుబ్బారావు, పాటంశెట్టి సుబ్బారావు, మార్గాని ఏడుకొండలు, గట్టి నర్సయ్య, బోడపాటి గోపి, గెడ్డం శివ పాల్గొన్నారు.

ఎస్‌కేవీటీ కళాశాలలో నేషనల్ స్టాటిస్టిక్స్ డే

రాజమహేంద్రవరం కల్చరల్ జూన్ 30: శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో జాతీయ గణాంక శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి ప్రపంచంలో గణాంకశాస్త్ర ప్రాముఖ్యతను తెలిపారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ డి.భగవాన్‌దాస్ మాట్లాడుతూ, గణాంకశాస్త్ర లక్షణాలు, విధులు, ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో గణిత శాస్త్ర, గణాంక శాస్త్ర శాఖాధిప తి సీవీ ప్రసాద్, అధ్యాపకులు ఎం.వీర్రాజు, సిహెచ్ చక్రవర్తి, ఈ.కీర్తి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 30: ఏపీఎస్ ఆర్టీసీ గ్యారేజీలోని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు ఆదివారం రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలో ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. వానిరి వైద్యులు పలు సలహాలు, సూచనలతోపాటు ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్లు మోగంటి రాజేష్, సాహిత్య వైద్యసేవలందించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ షేక్ షబ్బం, అసిస్టెంట్ మేనేజర్ ఎం.అజయ్‌బాబు, ఏఎంఎఫ్ పీబీఎస్ రాజు, సెక్యూరిటీ ఏఎస్ఐ రామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా నరసింహారావు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 30: రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ (2024-25) నూతన అధ్యక్షుడిగా నాళం నరసింహారావు, కార్యదర్శిగా కనకం చంద్రశేఖరరావు, కోశాధికారిగా నూలి శివ మల్లికార్జునలను ఎన్నికయ్యారు. ఈమేరకు జూలై 1వ తేదీ సోమవారం సాయంత్రం జేఎన్ రోడ్డులోని ఏకేసీ రోటరీ రివర్‌సిటీ హాలులో రోటరీ లాంఛనాలతో నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేయనుంది.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

బిక్కవోలు, జూన్ 30: పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. మండలంలో వివిధ పింఛనుదార్లు 10,786 మంది ఉన్నారని, వీరికి పెంచిన పింఛను రూ.4 వేలతో పాటు బకాయి మూడు వేలు సోమవారం ఉదయం నుంచి అందజేస్తామన్నారు. ఇందుకు గాను అన్ని గ్రామాల్లోని సచివాలయ సిబ్బందిని ఏర్పాటు చేశామని వారంతా ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు సొమ్ములు అందజేస్తారన్నారు. మండలం మొత్తం మీద పింఛన్లకు రూ.7,14,02,000ను ప్రభుత్వం విడుదల చేసిందని ఎంపీడీవో చెప్పారు.

రాజమహేంద్రవరం రూరల్‌లో 13,861 మంది లబ్ధిదారులు

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 30: రాజమహేంద్రవరం రూరల్ మండలం పరిధిలోని 10 గ్రామాల్లో 13,861 మంది లబ్ధిదారులకు రూ.13.58 కోట్లు పింఛన్ల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. 255 మంది సచివాలయ ఉద్యోగులతోపాటు ఇతర సిబ్బంది ఆరుగురితో పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి హుకుంపేట, బొమ్మూరు, ధవళేశ్వరం గ్రామాల్లో నిర్వహించే పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు.

రాజమహేంద్రవరంలో రక్తదాన శిబిరం

రాజమహేంద్రవరం కల్చరల్ జూన్ 30: స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్స్, యూత్ రెడ్ క్రాస్ వలంటీర్స్ రక్తదానం చేశారు. జేఎన్ రోడ్డులోని ఏకేసీ జూనియర్ కళాశాల పక్కనున్న రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి, రివర్ సిటీ నిర్వహణలో జరిగిన రక్తదాన శిబిరంలో ఆదిత్య వలంటీర్లు 16 యూనిట్ల రక్తాన్ని ధన్వంతరి బ్లడ్ బ్యాంక్‌కు దానం చేశారు. వీరితో పాటు మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ సభ్యులు ఎంఎస్‌కె రాజు, వంశీ, చగన్ చంద్ర, సాయి కూడా రక్తదానం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వి.భాస్కరరామ్, ఎల్.శ్రీనివాస్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీలు జీవీఎస్ నాగేశ్వరరావు, బీహెచ్ రమాదేవి, కె.మహేశ్వరి, పి.సాయి, ఉపన్యాసకులు సోనూ ప్రసాద్, ఆదిత్య డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డిప్రిన్సిపాల్ సిహెచ్ ఫణికుమార్, ఎస్.కె.ఎన్. రెహమాన్ వలంటీర్లను అభినందించారు.

ప్రధాని మనసులో మాటను తెలిపేందుకు మన్‌కీబాత్

అనపర్తి, జూన్ 30: తన మనస్సులో మాటలను దేశ ప్రజలతో పంచుకోవాలన్న సంకల్పంతో ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీబాత్ కార్యక్రమం రూపొందించారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం అనపర్తిలోని టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం కార్యాలయంలో మన్‌కీబాత్ కార్యక్రమాన్ని ఎన్డీయే నాయకులు కార్యకర్తలతో కలిసి ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశాన్ని అగ్రగామిగా నిలపాలన్నదే మోదీ లక్ష్యమని, ప్రతి నెలా నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా దేశంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించడమే కాకుండా జరిగిన అభివృద్ధిని కూడా దేశ ప్రజలకు తెలియజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు కొవ్వూరి సత్యనారాయణరెడ్డి టీడీపీ నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, మల్లిడి శ్రీనివాసరెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణ మాస్టారు పదవీ విరమణ సభ

కోరుకొండ, జూన్ 30: 40 ఏళ్ల సుదీర్ఘ కాలం ఉపాధ్యాయుడిగా పనిచేసిన సీహెచ్ సూర్యనారాయణ ఆదర్శప్రాయుడని ఎంఈవోలు టి.కుశలవ దొర, సుజాత అన్నారు. మండలంలోని నర్సాపురం ప్రాథమిక పాఠశాలలో పీఎస్ హెచ్‌ఎంగా పనిచేస్తూ ఆదివారం పదవీ విరమణ చేసిన సీహెచ్ సూర్యనారాయణ పదవీ విరమణ సభ ఆదివారం కోరుకొండ ఆదిత్య ఫంక్షన్‌హాల్లో జరిగింది. మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు విచ్చేసి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎం.శివబాబు, మందపాక భాస్కర్, కొచ్చెర్ల రమేష్, సీఆర్పీలు, నాయకులు పి.రాజారావు, మింగి శ్రీనివాసు, ఎస్టీయూ నాయకులు శర్మ, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కడియాల పాపారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణపట్నం కార్యదర్శి భాస్కరరావు సన్మాన సభ

రాజానగరం, జూన్ 3: మండలంలోని శ్రీకృష్ణపట్నంలో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ చేసిన కేవీ భాస్కర రావు సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కొనియా డారు. రాజమహేంద్రవరంలోని ప్రియాంక గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సన్మాన సభలో ఆయన పాల్గొని భాస్కరరావు దంపతులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రముఖులు, నాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రైనేజీలోని మంచినీటి పైప్‌లైన్ తొలగించండి

సింగవరంలో అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే బత్తుల



సీతానగరం, జూన్ 30: సింగవరంలో డ్రైనేజీలో ఏర్పాటు చేసిన మంచినీటి పైప్‌లైన్ వెంటనే తొలగించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన గ్రామంలో పర్యటించారు. గత ప్రభుత్వంలో సర్పంచ్ అభ్యంతరాలను పక్కనబెట్టి ఏకపక్షంగా డ్రైనేజీలో మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటుచేశారు. సర్పంచ్ సంగన పోశియ్య టీడీపీకి చెందిన వారు కావడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయన గోడును పట్టించుకోలేదు. ప్రస్తుతం మారిన వాతావరణంతో గ్రామంలో 12 మంది కామెర్లు వ్యాధితో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.ఈ సందర్భంగా గ్రామ పరిస్థితిని సర్పంచ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆదివారం సింగవరంలో పర్యటించి అనారోగ్యం పాలైన కుటుంబాలను కలసి పరామర్శించారు. గ్రామంలోని డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్‌ను పరిశీలించారు. వెంటనే మంచినీటి ట్యాంకు మూసివేసి ట్యాంకర్లతో మంచినీరు సరఫరా చేయాలని ఆదేశించారు. అలాగే డ్రైనేజీలో కట్టిన మంచినీటి పైప్‌లైన్ తొలగించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పెందుర్తి అచ్యుతరామారావు, సర్పంచ్ సంగన పోశియ్య, వలవల రాజా తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపోటములు సహజం

వైసీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా

దివాన్‌చెరువు, జూన్ 30: ప్రజాస్వామ్య వ్యవస్థలో జరిగే ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. దివాన్‌చెరువులోని ఒక ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగిన వైసీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. ఎన్నికల ఫలితాలను లోతైన విశ్లేషణ చేస్తే వైసీపీలో గ్రూపులు ఎక్కువ పెరిగిన చోట్ల ఆ పార్టీకి ఎక్కువ మెజార్టీ వచ్చిందన్నారు. నియోజకవర్గంలో తాను సాధించిన కొన్ని పనులు, ప్రాజెక్టులు చిట్టాను అవసరమైతే తాను తయారు చేసి ఇస్తానని, ఎన్నికల్లో గెలిచిన వారు వాటిని పూర్తి చేయిస్తే చప్పట్లు కొడతామన్నారు. సమావేశంలో గూడూరి శ్రీనివాస్, జక్కంపూడి విజయలక్ష్మి, మండారపు వీర్రాజు, దూలం పెద్ద, కొల్లి వీర్రాజు, గంగిశెట్టి సోమేశ్వరరావు, గండి నానిబాబు, జడ్పీటీసీ వాసంశెట్టి పెదవెంకన్న పాల్గొన్నారు.

రంగంపేట ఇన్‌చార్జి ఎంపీడీవోగా వెంకటరత్నం

రంగంపేట, జూన్ 30: రంగంపేట ఈవోపీఆర్డీ టి.వెంకటరత్నానికి ఇన్‌చార్జి ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్టు జడ్పీ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి ఉత్తర్వులు జారీచేసారు. ప్రస్తుతం ఎంపీడీవోగా పనిచేసిన బి.శ్రీరామరాజు ఆదివారం పదవీ విరమణ చేయడంతో వెంకటరత్నం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఆయనకు మండలంలో అన్ని శాఖల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరత్నం మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం ఉదయమే ఇంటింటికీ పింఛన్లు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

పోస్టల్ ఉద్యోగుల సమావేశం

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 30: స్థానిక ఆనం రోటరీ సమావేశపు హాలులో జిల్లా పోస్టల్ అసిస్టెంట్స్‌గా 1981-83లో నియమితులైన అభ్యర్థుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి పదవీ విరమణ చేస్తున్న ముమ్మిడి సత్యనారాయణ అధ్యక్షత వహించగా, వి.రవికృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. పలువురు మాట్లాడుతూ సర్వీసుకు సంబంధించి సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ తెలంగాణా హైకోర్టు, సుప్రీం కోర్టు తీర్పును యథావిధిగా వెంటనే అమలు చేయాలన్నారు. లేకపోతే తెలంగాణ, ఆంధ్ర చీఫ్ పోస్టు మాస్టర్ ఎదుట ఆందోళన చేపట్టాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో పుల్లేశ్వరరావు, నాగేంద్రబాబు, కృష్ణమోహన్‌తోపాటు 40మంది పాల్గొన్నారు.

పొగాకు రైతుల సమస్యల పరిష్కారానికి

కేంద్ర మంత్రి చొరవపై ఎంపీ హర్షం

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 30: పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ చొరవ చూపడం పట్ల బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. ఇటీవల పొగాకు రైతులు, వ్యాపారులు, అధికారులతో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ నిర్వహించిన సమావేశంలో తాను కూడా పాల్గొన్నానన్నారు. మూడేళ్లకు ఒకసారి రైతులు నమోదు, పెనాల్టీ మినహాయింపు, పొగాకు బోర్డులో సిబ్బందిని పెంచడం, బ్యారన్ల సమస్యలు తదితర అంశాలను ప్రస్తావించారన్నారు. పొగాకు రైతు ప్రతినిధులతో పాటు కేంద్ర మంత్రిని కలసి వినతిపత్రం సమర్పించినట్టు ఆమె పేర్కొన్నారు.

ఏకగ్రీవంగా ఆర్యాపురం బ్యాంకు పాలక మండలి

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 30: ఆర్యాపురం అర్బన్ బ్యాంకుకు పాలకమండలి ఎన్నికలు లేకుండా ఏకగ్రీవంగా చేసుకోవాల్సిన అవసరం ఉందని, బ్యాంకును పరిరక్షించుకోవడానికి అందరూ సమాయత్తం కావాలని అఖిలపక్ష ప్రజాసంఘాలు నిర్ణయించాయి. ఆదివారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో బ్యాంకు మాజీ డైరెక్టర్ లంక సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ ఆర్యాపురం బ్యాంకు ఎన్నికలు జూలై 20న జరుగుతున్నాయని, ఎన్నికలు లేకుండా పాలకమండలిని ఏకగ్రీవం చేసుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ఆర్యాపురం బ్యాంకు 78 వేల సభ్యులతో పటిష్టంగా ఉందని, అలాంటి బ్యాంకును రక్షించుకోవడానికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాలకమండలిలో ఉండాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలేపల్లి మురళీధర్, సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్, జాంపేట బ్యాంకు డైరెక్టర్ మహంతి లక్ష్మణరావు, బ్యాంకు మాజీ డైరెక్టర్ కొవ్వూరి శ్రీనివాసరావు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కుండ్రపు రాంబాబు మాట్లాడారు. సీపీఐ నగర కార్యదర్శి కొండలరావు, ఆప్ నాయకుడు స్వామి, దేవత సుధాకర్, తారకేష్, నరవ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌హెచ్‌ఎం జేఏసీ సమావేశం

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 30: ఏపీ ఎన్‌హెచ్‌ఎం జేఏసీ తూర్పుగోదావరి జిల్లా సమావేశం ఆదివారం రాజమహేంద్రవరంలోని ఇన్నీసుపేట యూపీహెచ్‌సీలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా టి.సుజాత, ప్రధాన కార్యదర్శిగా జే.రాజశేఖర్, కోశాధికారిగా బీసీహెచ్ శ్రీరాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ సూర్యారాణిను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల రెగ్యులరైజేషన్, సమానపనికి సమాన వేతనం, హెచ్‌ఆర్ పాలసీ అమలు, ఒన్ టైం సెటిల్‌మెంట్ వంటి డిమాండ్లు సాధించుకోవడానికి రాష్ట్ర కమిటీతో కలిసి పనిచేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ ఏవీ నాగేశ్వరరావు, కేపీ నాయుడు, దయముని పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి ఇంటి వద్ద వంటా వార్పు

అనపర్తి, జూన్ 30: మండలంలోని కుతుకులూరులో వైసీపీ నాయకుడు పడాల హరిసాయి కృష్ణారెడ్డి వల్ల మోసపోయామంటూ మాజీ ఉప సర్పంచ్ పడాల శ్రీనివాసరెడ్డి, వలంటీర్లు చేపట్టిన నిరసన దీక్ష ఆదివారం రెండో రోజు కొనసాగించారు. బాధితులు వంటావార్పు నిర్వహించి తమకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన వారికి భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రెండు రోజులుగా ఇంటి ముందు నిరసన చేపట్టినా సాయిలో మార్పు రాలేదన్నారు. తనకు న్యాయం జరిగే వరకు దీక్షలో ఉంటానన్నారు. కాగా సాయిరామారెడ్డికి మద్దతు తెలుపుదామంటూ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి వైసీపీ కార్యకర్తలకు పిలునివ్వడంతో ఆయనతోపాటు వైసీపీ కార్యకర్తలను అనపర్తిలోనే నిలువరించారు.

విద్యార్థి పరిషత్ కో కన్వీనర్‌గా లలిత్‌కుమార్

రాజమహేంద్రవరం కల్చరల్ జూన్ 30: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 26 వరకు జరిగిన ప్రాంత అభ్యాస వర్గలో రాజమండ్రికి చెందిన కె.లలిత్‌కుమార్‌ను స్టేట్ స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ (ఎస్ఎఫ్‌డీ) కోకన్వీనర్‌గా రాష్ట్ర అధ్యక్షులు నియమించారు. ఈ సందర్భంగా లలిత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 77ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల కోసం రాజీలేని పోరాటం చేస్తామన్నారు.

ఎమ్మెల్యే వాసును కలిసిన యాదవ సంక్షేమ సంఘం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 30: రాజమహేంద్రవరం అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను స్థానిక తిలక్‌రోడ్డులోని ఆయన కార్యాలయంలో శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఆదివారం అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు నొడగల సుధాయాదవ్, శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు కరగాని వేణుయాదవ్, అధ్యక్షుడు జానా కేశవ యాదవ్, ప్రధాన కార్యదర్శి బొట్ట వీరబాబు యాదవ్, మాజీ అధ్యక్షుడు చావలి రాజేశ్వరరావు యాదవ్ ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ యాదవులు తన సొంత ఇంట్లో మనుషులని ఎప్పుడు అవసరం వచ్చినా అండగా ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వారాది హనుమంతరావు యాదవ్, ఉర్లంకల లోకేష్ యాదవ్, పూనపూడి రాము యాదవ్, ప్రకృతి సత్తిబాబు, పట్టపగలు ప్రకాశరావు, తుల్లి పద్మ, కొయ్యన కుమారి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేస్తే ప్రజా మన్ననలు

గోకవరం, జూన్ 30: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తేనే ప్రజా మన్ననలు పొందగల్గుతామని ఎస్ఐ కె.నాగరాజు అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గోకవరం ఎస్ఐ-2గా విధులు నిర్వర్తించిన సీహెచ్.సత్యనారాయణ వ్యక్తిగత కారణాలతో స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. దీంతో ఆయనను స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నేడు అర్జీల స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్ జూన్ 30: జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ స్థాయిలో ఆర్డీవో, మునిసిపల్ స్థాయిలో కమిషనర్లు, మండల స్థాయిలో సంబంధిత అధికారులు అందుబాటులో ఉండి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

పింఛన్ల పండుగ

పండుటాకుల ఆనందాల వేడుక



(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

నియోజకవర్గాల వారీగా..ఇలా

కొవ్వూరు నియోజకవర్గంలో 31,716 మందికి రూ.21,24,32,000 పంపిణీ చేస్తారు. నిడదవోలు నియోజకవర్గంలో మొత్తం 35817 మందికి రూ.24,18,17,500 పంపిణీ చేయనున్నారు. రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 39,777 మందికి రూ.26,67,14,500 పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. అనపర్తి నియోజకవర్గంలో మొత్తం 30,260 మందికి రూ.20,21,92,500 పంపిణీ చేసేందుకు రంగం సిద్ధమైంది. గోపాలపురం నియోజకవర్గంలో 32,058 మందికి రూ.21,80,25,000 పంపిణీ చేయనున్నారు. జిల్లాలో ఏఆర్‌టీ (పీఎల్ హెచ్‌ఐవీ) కింద 2531 మందికి రూ.1,77,17,000 మొత్తం జిల్లాలో 2,44,302 మందికి రూ.165 కోట్ల 13 లక్షల, 29 వేల 500 పంపిణీ చేయనున్నారు. రాజానగరం నియోకజవర్గంలో అత్యధికంగా 39,777 మందికి రూ. 26 కోట్ల, 67 లక్షల 14 వేల 500 పంపిణీ చేయనున్నారు.

మండలం	పింఛన్‌దారులు	రూ.కోట్లలో
అనపర్తి	10,439	రూ.6,99,57,500
బిక్కవోలు	10786	రూ.7,14,02,000
రంగంపేట	9035	రూ.6,08,33,000
దేవరపల్లి	11,171	రూ.7,58,86,000
గోపాలపురం	9238	రూ.6,30,14,500
నల్లజర్ల	11,649	రూ.7,91,24,500
గోకవరం	10,701	రూ.7,20,87,500
చాగల్లు	9503	రూ.6,34,69,500
కొవ్వూరు	10,257	రూ.6,82,32,000
కొవ్వూరు(మున్సిపాల్టీ)	4015	రూ.2,78,51,000
తాళ్లపూడి	7941	రూ.5,28,79,500
నిడదవోలు	10,551	రూ.7,05,80,000
నిడదవోలు(మున్సిపాల్టీ)	4334	రూ.2,99,97,000
పెరవలి	10,420	రూ.6,95,34,000
ఉండ్రాజవరం	10,512	రూ.7,17,06,500
కడియం	12,144	రూ.8,20,43,500
కోరుకొండ	12,474	రూ.8,20,43,500
రాజానగరం	15,564	రూ.10,43,00,000
సీతానగరం	11,739	రూ.7,79,41,500
రాజమండ్రి (అర్బన్)	29,436	రూ.20,24,48,000
రాజమండ్రి(రూరల్)	32,006	రూ.21,78,95,500
రూరల్ (వార్డుల పరిధి)	19,862	రూ.13,58,52,000

రూ.7,000 అందుకునే సంబరం

- ఇంటి వద్దకే 'ఎన్టీఆర్ భరోసా'
- వృద్ధులకు రూ.7 వేలు, దివ్యాంగులకు రూ.6వేలు
- నేడు పంపిణీ చేయనున్న సచివాలయ సిబ్బంది, కూటమి క్యాడర్

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ఓ పండగలా జరగనుంది. సార్వత్రిక ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పింఛన్‌ను రూ.3 వేల నుంచి 4 వేలకు పెంచడంతో పాటు ఏప్రిల్ నెల నుంచే వీటిని అమలు చేస్తామని చెప్పిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం ఒక్కొక్కరికి రూ.7వేల వంతున పింఛన్ ఇవ్వనున్నారు. జిల్లాలో మొత్తం 18 రకాల పింఛన్లు ఉన్నాయి. అందులో వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, వీవర్స్, కల్లుగీత కార్మికులు, ఫిషర్‌మెన్, గీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్, ఏఆర్‌టీ హెచ్‌ఐవీ, డప్పు కళాకారులు ఇలా ఈ కేటగిరీల్లో ఉన్న వారికి గతంలో రూ.3 వేలు ఇచ్చేవారు. వారికి ఇక నెలకు రూ.4 వేల వంతున వస్తుంది. కానీ ఏప్రిల్ నుంచి ఇది అమలు చేయడం వల్ల ఏప్రిల్, మే, జూన్ నెలలో వేయితో కలిపి రూ.7 వేలు వంతున పంపిణీ చేయనున్నారు. దివ్యాంగులు, కుష్ఠు బాధితులకు ఇచ్చే పెన్షన్ సొమ్మును రూ.3 వేల నుంచి 6 వేలుకు పెంచారు. వారికి సోమవారం రూ.6 వేలు అందజేయనున్నారు. పూర్తి దివ్యాంగులు, మస్కిలర్ జిస్ట్రోఫి, పెరాలసిస్‌తో బాధపడుతుతూ వీల్ చైర్‌లేదా, బెడ్ మీద ఉన్నవారికి, రూ.5 వేల నుంచి 15 వేలకు పెంచారు. కిడ్నీ, లివర్, హార్ట్, సీకేడీయూ, సీకేడీయూ డయాలసిస్ పింఛన్లు రూ. 5వేల నుంచి 10 వేలకు పెంచిన సంగతి తెలిసిందే. జిల్లాలో మొత్తం 2,44,302 పింఛన్‌దార్లకు రూ.165.13 కోట్ల డబ్బు అందనుంది. దీనికి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఇప్పటికే ఏర్పాట్లు చేయించారు.

4092 మంది సిబ్బంది

పింఛన్ల పంపిణీకి సిద్ధం

కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం, జూన్ (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సోమవారం ఉదయం 6 గంటల నుంచే పంపిణీ చేయనున్నామని, పంపిణీ నిమిత్తం 4092 మంది ఉద్యోగులను సిద్ధం చేశామని, అందులో సచివాలయ ఉద్యోగులు 3905 మంది, ఇతర శాఖల ఉద్యోగులు 187 మంది ఉన్నారని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఆదివారం ఆమె పింఛన్ల పంపిణీపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పింఛన్ పంపిణీతో పాటు ప్రతీ లబ్ధిదారుడికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాసిన లేఖను అందజేయాలన్నారు. ఉదయం 5 గంటల నుంచే అందరూ సన్నద్ధంగా ఉండాలని, పింఛన్ పంపిణీ చేశాక, నగదు అందినట్టు రశీదు తీసుకోవాలన్నారు.

6 గంటలకే

ఇంటింటికి..

పెంచిన పింఛన్ల సొమ్మును సోమవారం లబ్ధిదారుల ఇళ్లవద్దకే ఉదయం 6 గంటలకు వెళ్లి టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, అధికారుల సమక్షంలో సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేయనున్నారు. సోమవారం మొత్తం పింఛన్లను పంపిణీ చేసేందుకు సమాయత్తమయ్యారు. ఒకవేళ ఏమైనా పెండింగ్ ఉంటే మంగళవారం పంపిణీ చేస్తారు. పింఛన్ల పంపిణీ సమయాన ఎవరైనా లేకపోయినా తర్వాత తీసుకునే వెసులుబాటు కూడా ఉంది. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నిడదవోలు మండలం గోపవరంలో మొదట పంపిణీ చేస్తారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి రాజమండ్రి రూరల్ మండలంలోని కోలమూరులో ఉదయం 6 గంటలకు పింఛన్ల కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఉదయం 7 గంటలకు హుకుంపేట డి బ్లాక్ నుంచి పంపిణీ మొదలు పెట్టి, శాటిలైట్ సిటీ, బొమ్మూరు ఎస్సీ పేట, ధవళేశ్వరం పంచాయతీ ఆఫీసు వద్ద, కడియం మండల ఆఫీసు, సిటీలోని 16వ వార్డులోని మేకల కబేళా వద్ద, 27వ డివిజన్‌లోని అంగన్‌వాడీ స్కూల్ కార్యక్రమాల్లో పాల్గొంటారు. కలెక్టర్ ప్రశాంతి, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు వీఎల్‌పురం పార్కు వద్ద ఉదయం 6 గంటలకు పెన్షన్ల పంపిణీని మొదలు పెడతారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ కలిసి ఉదయం 6గంటలకు రాజానగరంలోనూ, 7 గంటలకు కోరుకొండలోనూ, 8గంటలకు సీతానగరంలోనూ పింఛన్లను పంపిణీ చేస్తారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఉదయం 6 గంటలకు అనపర్తి, ఏడు గంటలకు బిక్కవోలు, 9గంటలకు పెదపూడి మండలంలోనూ పంపిణీ చేస్తారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఉదయం 6 గంటలకు ద్వారకా తిరుమలలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభించి, ద్వారకా తిరుమల మండలంలో 10 చోట్ల, నల్లజర్ల మండలంలో 10 చోట్ల, గోపాలపురంలో 10 చోట్ల, దేవరపల్లిలో పది చోట్ల మొత్తం 40 చోట్ల ఆయన భాగస్వామ్యం కానున్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కొవ్వూరులో మూడుచోట్ల పంపిణీ చేయనున్నారు.

నేడు డిప్యూటీ సీఎం పవన్ రాక



- గొల్లప్రోలులో పింఛన్ల పంపిణీలో పాల్గొననున్న జనసేనాని
- ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్
- పర్యటనకు భారీ బందోబస్తు
- మూడురోజులపాటు జిల్లాలో కార్యక్రమాలు

పిఠాపురం/గొల్లప్రోలు, జూన్ 30: పిఠాపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత తొలిసారి పిఠాపురం నియోజకవర్గానికి రానున్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత కొణిదెల పవన్‌కల్యాణ్ పర్యటనకు సర్వం సిద్ధమైంది. ఇటు అధికార యంత్రాంగంతోపాటు జనసేన, టీడీపీ, బీజేపీ నేతలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి పిఠాపురం నియోజకవర్గానికి సోమవారం వస్తున్న పవన్‌కల్యాణ్ గొల్లప్రోలులోని సత్యకృష్ణ కల్యాణమండపంలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాలుపంచుకోనున్నారు. పవన్ చేబ్రోలు నివాసంలో మూడు రోజులు ఉండనున్న నేపథ్యంలో అక్కడ భారీఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతోపాటు ఇంటిపై భారీ బెలూన్ ఏర్పాటు చేశారు. ఇంటివద్ద బారికేడింగ్ ఏర్పాటు చేశారు. కాగా పవన్ పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సగిల షాన్‌మోహన్ పరిశీలించారు. గొల్లప్రోలు హెలిప్యాడ్‌తోపాటు పవన్ పర్యటించే ప్రాంతాల్లో పరిశీలన జరిపి అధికారులకు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట కాకినాడ ఆర్డీవో కిషోర్, డీఎస్పీ హనుమంతరావు, డీఆర్డీఏ పీడీ శ్రీరమణి తదితరులు ఉన్నారు.

పవన్ పర్యటన సాగేది ఇలా..

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సోమవారం నుంచి మూడురోజులపాటు కాకినాడ జిల్లాలో పర్యటించనున్నారు. పవన్ పర్యటన వివరాలను అధికారికంగా ఆదివారం రాత్రి వెల్లడించారు.

నేడు పింఛన్ల పంపిణీ

సోమవారం ఉదయం 6గంటలకు హైదరాబాద్‌లోని తన ఇంటినుంచి బయలుదేరి బేగంపేట ఎయిర్‌పోర్టుకు వెళ్తారు. 6.30గంటలకు అక్కడ బయలుదేరి రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఉదయం 7.30 గంటలకు అక్కడ బయలుదేరి గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని తన నివాసానికి ఉదయం 9గంటలకు చేరుకుంటారు. తిరిగి 9.45 గంటలకు బయలుదేరి 10గంటలకు గొల్లప్రోలు పట్టణంలో సత్యకృష్ణ ఫంక్షన్‌హాలుకు చేరతారు. అక్కడ 12.30గంటల వరకూ జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పింఛన్లు పంపిణీ చేస్తారు. అనంతరం అక్కడినుంచి బయలుదేరి చేబ్రోలులోని నివాసానికి చేరుకుంటారు. భోజన విరామం తర్వాత మధ్యాహ్నం పిఠాపురం నియోజకవర్గ జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలతో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు.

రేపు శాఖలవారీగా సమీక్ష

2వతేదీన ఉదయం 9.30గంటలకు చేబ్రోలు నివాసం నుంచి బయలుదేరి 10గంటలకు కాకినాడ కలెక్టరేట్ చేరుకుంటారు. 10నుంచి 11గంటల వరకూ కలెక్టర్ కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల అధికారులతో, 11నుంచి 11.30గంటల వరకూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో, 11.30నుంచి 12గంటల వరకూ రోడ్ల పరిస్థితిపై పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో, 12గంటల నుంచి ఒంటి గంట వరకూ అటవీశాఖ అధికారులతో, ఒంటి గంట నుంచి రెండు గంటల వరకూ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అధికారులతో, అనంతరం సైన్స్ అండ్ టెక్నాలజీ అధికారులతో సమావేశమవుతారు. అక్కడినుంచి మధ్యాహ్నం 2.30గంటలకు చేబ్రోలు నివాసానికి చేరుకుంటారు. భోజన విరామం తర్వాత జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలతో సమావేశమవుతారు.

ఎల్లుండి బహిరంగసభ

3వతేదీన ఉదయం 10గంటలకు చేబ్రోలు నివాసం నుంచి బయలుదేరి కొత్తపల్లి మండలం ఉప్పాడ చేరుకుంటారు. 10.45గంటల నుంచి 12గంటల వరకూ సముద్రపు కోత ప్రాంతాన్ని పరిశీలిస్తారు. 12.45గంటలకు చేబ్రోలు నివాసానికి చేరుకుని పిఠాపురం నియోజకవర్గ అధికారులతో సమావేశమవుతారు. అనంతరం టీడీపీ, జనసేన ముఖ్యనేతలతో భేటీ ఉంటుంది. మధ్యాహ్నం 3.30గంటలకు చేబ్రోలు నుంచి బయలుదేరి పిఠాపురం పట్టణం ఉప్పాడ సెంటర్‌లో జరిగే వారాహి బహిరంగసభ వద్దకు చేరుకుంటారు. సాయంత్రం 6గంటలకు అక్కడినుంచి బయలుదేరి విజయవాడ వెళ్తారు.

డిప్యూటీ సీఎం పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒక డీఎస్పీతోపాటు 8మంది సీఐలు, 20మంది ఎస్‌ఐలు, 200మంది సిబ్బందిని బందోబస్తు నిమిత్తం నియమించారు. ఎనిమిది రోప్ పార్టీలను రంగంలోకి దించారు.

ఇసుక లోడింగ్ చేసినా, రవాణాకు పాల్పడినా

కఠిన చర్యలు తీసుకుంటాం

జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి ఎం.సుబ్రహ్మణ్యం



రాజమహేంద్రవరం, జూలై 30(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నిమిత్తం జిల్లాలో ఏడు ఇసుక నిల్వల డిపోల్లో నిల్వ ఉంచిన ఇసుకను లోడింగ్ చేయడం, రవాణా చేయడం చట్టరీత్యా నేరమని అటువంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి ఎం. సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా లారీ ఓనర్లు, డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ఆదివారం లాలాచెరువు స్టాక్ పాయింట్ వద్ద 3 ప్రొక్లైనర్లు, ఒక లారీ, కడియపులంక వద్ద 5 ప్రొక్లైనర్లు ఒక లోడ్ లారీని సీజ్ చేసినట్టు ఆయన చెప్పారు. ఇసుక అక్రమ రవాణాపై నిరంతరం నిఘా ఉంచినట్లు సుబ్రహ్మణ్యం చెప్పారు. సిబ్బంది పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



ఇరిగేషన్ ప్రాజెక్టులను కలెక్టర్‌కు వివరిస్తున్న సర్కిల్ ఎస్ఈ

శివారు భూములకు సాగునీరు అందించండి

వరదలను సమర్ధవంతంగా ఎదుర్కొనే చర్యలు చేపట్టాలి

ఇరిగేషన్ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్ ప్రశాంతి

ధవళేశ్వరం,జూన్ 30: డెల్టాలోని శివారు ఆయకట్టు భూములకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించాలని అలాగే గోదావరి వరదలను సమర్ధవంతంగా ఎదుర్కొనేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిస్థితిపై ఆదివారం ఆమె సమీక్షించారు. సాయంత్రం క్యాంపు కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరదలను ఎదుర్కొనడానికి తీసుకున్న ముందస్తు కార్యాచరణ, అత్యవసరంగా చేపట్టాల్సిన పనులు వాటికి కావాల్సిన నిధులు, వివరాలతో నివేదిక అందజేయాలని అధికారులను కోరారు. జిల్లాలో ప్రస్తుతం నీటి లభ్యత, సాగు, తాగునీటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. డ్రైన్‌లకు సంబంధించి నిర్వహణ వ్యవస్థపై సమీక్షించారు. పుష్కర, చాగల్నాడు, వెంకటనగరం, తొర్రిగడ్డ, పంపింగ్ స్కీంలకు చేపట్టాల్సిన పనులు అందుకు అవసరమైన నిధుల వివరాలను ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

కోట సత్తెమ్మకు విశేష పూజలు



నిడదవోలు, జూన్ 30: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవ ధూప హారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు, క్షీర, మహానివేదన చేశారు. అనంతరం ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. అమ్మవారికి ప్రత్యేక దర్శనం, అన్నదాన విరాళాలు, ప్రసాద విక్రయాలు, పూజా టికెట్ల ద్వారా రూ.1,47,469 ఆదాయం లభించినట్లు ఆలయ సహాయ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు.

సుందర గోవిందుడికి కుంభాభిషేకం

కొవ్వూరు, జూన్ 30: సుందర గోవిందునికి పవిత్ర నదీ తీర్థాలతో నింపిన 1,116 అమృత కలశాలతో కుంభాభిషేకం నిర్వహించారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని సుందర గోవిందుని ఆలయంలో జరుగుతున్న వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా గోపూజ, అవాహిత దేవతా హోమాలు, కలశోద్వాసన, పూర్ణాహుతి, స్వామికి పవిత్ర నదీ జలాలతో కుంభాభిషేకం, శిఖరపూజ, మంగళహారతి, పండిత సత్కారాలు, మహాదాశీర్వచనాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

మానవత నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



నిడదవోలులో మానవత నూతన కార్యవర్గంతో మంత్రి దుర్గేష్

నిడదవోలు, జూన్ 30: సమాజానికి మానవత సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం నిడదవోలులోని ఏబీఎస్ టౌను హాలులో మానవత నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షుడిగా దారపురెడ్డి సూర్యచంద్రావు, కార్యదర్శిగా ముళ్ళపూడి సోమరాజు, ట్రెజరర్‌గా పీఎస్‌వీ సుబ్బారాయుడు, ఉపాధ్యక్షుడిగా అన్నమరెడ్డి కొండలరాయుడు, సహాయ కార్యదర్శిగా నిప్పులేటి వెంకటరమణ తదితరులతో జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహనరావు ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గాన్ని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అభినందించారు. కార్యక్రమంలో గమిని రాంబాబు, బోయపాటి రామలక్ష్మి, తాతిన వెంకట కృష్ణారావు, తన్నీడి బోసు, నీలం రామారావు పాల్గొన్నారు.

జనసేన 'పశ్చిమ' అధ్యక్షుడిని కలిసిన సువర్ణరాజు

దేవరపల్లి, జూన్ 30: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గోవిందరాజును గోపాలపురం నియోజకవర్గ కన్వీనర్ సువర్ణరాజు భీమవరంలో ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా గోవిందరాజు మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోనే కాకుండా జనసేన నాయకులు వీరమహిళలు, మెగా అభిమానులు ఎంతో కష్టపడి ఎన్నికల్లో పని చేశారని వారి కష్టఫలితమే ఈ రోజు ఎన్‌డీఏ కూటమి దేశంలోను, రాష్ట్రంలోను అధికారంలోకి వచ్చిందన్నారు. గోపాలపురంలో కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజును గెలిపించడంలో సువర్ణరాజు పాత్ర ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల జనసేన నాయకులు కట్నాం గణేష్, బాపిరాజు, సలాది శివనాగప్రసాద్, అంజిబాబు, బాబీ, పసుపులేటి ప్రసాద్, కృష్ణంపాలెం సర్పంచ్ నాయుడు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి గోయల్‌ను కలిసిన పొగాకు రైతులు



కేంద్ర మంత్రి పియూష్ గోయల్‌ను కలిసిన పొగాకు రైతులు

దేవరపల్లి, జూన్ 30: పొగాకు రైతుల సమస్యలు పరిష్కరించాలని వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్‌కు పొగాకు రైతు సంఘం నాయకులు ఆదివారం విజయవాడలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొగాకు పరిమితికి మించి అదనపు అమ్మకాలపై అపరాధ రుసుము లేకుండా చూడాలని, పొగాకు బోర్డులో ఉద్యోగులను రిక్రూట్ చేయాలని మంత్రికి వివరించారు. దీంతో మంత్రి మాట్లాడుతూ రైతు పండించిన పొగాకుకు బోర్డులో అదనపు అమ్మకాలపై పెనాల్టీ లేకుండా చూస్తామని, పొగాకు వేలం కేంద్రాల్లో 220 మంది ఉద్యోగులను భర్తీ చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు ఛైర్మన్ యశ్వంత్ కుమార్, ఈడీ గిరిధర్‌బాబు, ఐటీఏఐ అధ్యక్షుడు శ్యామ్, దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం రైతు సంఘం నాయకులు కరుటూరి శ్రీనివాస్, సత్రం వెంకట్రావు, పరిమిరాంబాబు, పిన్నమనేని మధుమోహన్, విల్లూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు భోజనం ప్లేట్ల వితరణ

తాళ్ళపూడి, జూన్ 30: అన్నదేవరపేటలోని అంగన్‌వాడీ కేంద్రం పిల్లలకు ఆదివారం కొడమంచిలి జాన్‌బాబు భోజనం ప్లేట్లను అందజేశారు. అలాగే స్థానిక హాస్టల్లోని 50 మంది విద్యార్థులకు పెన్సిల్ బాక్సులు, పెన్నులు, పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో యువగళం నాయకులు కూచిపూడి గణపతి, భరత్, రఘు, అబ్బులు, అరుంధతీపేట యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

కొవ్వూరు, జూన్ 30: పేకాట శిబిరంపై దాడిచేసి ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. కొవ్వూరులోని మెహెర్‌బాబా గుడి వీధిలో ఆదివారం మధ్యాహ్నం పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేశామని, ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.2970 స్వాధీనం చేసుకున్నామన్నారు.

మహిళ సమ్మేళన సభకు తరలిరండి



సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర మహిళ ప్రముఖ్ సునీతదేవి

నల్లజర్ల, జూన్ 30: పెంటపాడు గోయింక కళాశాలలో జూలై 6,7,8 తేదీల్లో జరిగే మహిళ సమ్మేళన సభకు నియోజకవర్గంలోని విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) మహిళలు అధిక సంఖ్యలో తరలి రావాలని ఉత్తరాంధ్ర మహిళ ప్రముఖ్ సునీతదేవి పిలుపునిచ్చారు. ఆదివారం నల్లజర్లలోని వేణుగోపాల స్వామి కల్యాణ మండపంలో మండలాధ్యక్షుడు కందుల రవి అధ్యక్షతన జరిగిన వీహెచ్‌పీ సమావేశంలో ఆమె మాట్లాడారు. వీహెచ్‌పీ విధి విధానాలు, నూతన కమిటీలు, భవిష్యత్ ప్రణాళిక వంటి అంశాలపై మహిళ సమ్మేళనంలో చర్చించనున్నట్టు పేర్కొన్నారు. ప్రతి గ్రామం నుంచి మహిళలు పాల్గొనే విధంగా పరిషత్ ప్రముఖ్‌లు తగిన ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ముత్యాల గంగాధర్, వెల్లింకి రాఘవ, మాయలేడి తాతారావు, సవలం రామకృష్ణ, బద్దిరెడ్డి నాగేశ్వరావు, వంకిన వెంకటరాజు పాల్గొన్నారు.

పశివేదలలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

కొవ్వూరు, జూన్ 30: శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు వైద్యాన్ని అందించడం అభినందనీయమని టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావు అన్నారు. కొవ్వూరు మండలం పశివేదలలో ఆదివారం కమ్మ సేవాసమితి, వేమగిరి శ్రీ పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. దీనికి ద్విసభ్య కమిటీ విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బేతిన నారాయణ, మురళీగణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 30: ఏపీఎస్ ఆర్టీసీ గ్యారేజీలోని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు ఆదివారం రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలో ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. వానిరి వైద్యులు పలు సలహాలు, సూచనలతోపాటు ఉచితంగా మందులు అందజేశారు.డాక్టర్లు మోగంటి రాజేష్, సాహిత్య వైద్యసేవలందించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ షేక్ షబ్బాం, అసిస్టెంట్ మేనేజర్ ఎం.అజయ్‌బాబు, ఏఎంఎఫ్ పీబీఎస్ రాజు, సెక్యూరిటీ ఏఎస్‌ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

'చంద్ర'తో హెక్టారుకు 7.5 టన్నుల దిగుబడి

- 'శ్రావణి'తో 140 రోజులకే పంట
- సార్వాలో అనువైన వరి రకాలు సిద్ధం
- ఏరువాక జిల్లా కోఆర్డినేటర్ చల్లా నరసింహారావు



రాజానగరం, జూన్ 30: ఉభయ గోదావరి జిల్లాల్లో సార్వా సాగుకు అనువైన వరి రకాలు సిద్ధంగా ఉన్నాయని రైతులు వినియోగించుకోవాలని జిల్లా ఏరువాక కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు, కాకినాడ, కోనసీమ, ఏలూరు జిల్లాల్లో స్వర్ణ, ఎంటీయూ 1318; పీఎల్‌ఏ 1100; సంపద స్వర్ణ వంటి రకాలను సార్వా కాలంలో రైతులు సాగు చేస్తున్నారు. వీటికి ప్రత్యామ్నాయంగా సాగు చేయదగిన వరి రకాలు, వాటి గుణగణాలను ఆయన రైతులకు వివరించారు.

శ్రావణి(ఎంటీయూ1239):

సార్వాలో ఎంటీయూ 1318, స్వర్ణ, ఎంటీయూ 1064, ఎంటీయూ 1061, సంపద స్వర్ణ రకాలకు ప్రత్యామ్నాయంగా సాగుచేయదగిన తెలుపు గింజ రకం. 140 రోజుల పంటకాలం కలిగి ఉంటుంది. కాండం దృఢంగా ఉండి చేను పడిపోదు. రెండు వారాల నిద్రావస్థ ఉండడం వల్ల అధిక వర్షాల సమయంలో గింజ మొలకెత్తదు. దోమపోటు, ఎండాకు తెగుళ్లను తట్టుకుంటుంది. సగటు దిగుబడి హెక్టారుకు 7.0 టన్నులు

చంద్ర(ఎంటీయూ-11153):

ఉభయ గోదావరి జిల్లాల్లో ముంపు వల్ల సార్వా ఆలస్యమయ్యే ప్రాంతాల్లో సాగుచేయడానికి అనువైన ఎంటీయూ-1010కు ప్రత్యామ్నాయంగా సాగుచేయదగిన స్వల్ప రకం. పంటకాలం 115 రోజులు, గింజ పొడవుగా, లావుగా ఉంటుంది. బియ్యం పొట్ట తెగులు లేకుండా పారదర్శకంగా ఉండి, గింజ రాలిక తక్కువగా ఉంటుంది. సగటు దిగుబడి హెక్టారుకు 7.5 టన్నులు వస్తుంది. దోమపోటు, అగ్గి తెగుళ్లను ఈ రకం తట్టుకుంటుంది.



ఎంటీయూ రైస్ 1273:

ఉభయ గోదావరి జిల్లాల్లో రైతులు సాగు చేస్తున్న పీఆర్ 126, ఎస్ఎల్ 10; ఎంటీయూ 1264, ఎంటీయూ 1010 రకాలు ప్రత్యామ్నాయమైన రకం. గింజ 6.66 మి.మీ పొడవు కలిగి కాకినాడ పోర్ట్ ద్వారా ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేయడానికి అనువైన రకం. 120 రోజుల కాల పరిమితి కలిగి, చేను పడిపోదు. బియ్యం పారదర్శకంగా ఉండి, గింజ రాలిక తక్కువగా ఉంటుంది. అగ్గి తెగులును కొంత వరకు తట్టుకుంటుంది. సగటున హెక్టారుకు 7.0 నుంచి 7.5 టన్నులు దిగుబడినిచ్చే రకం.

ఎంటీయూ రైస్ 1232:

అధిక దిగుబడి నిచ్చే వరి రకం. శాఖీయ దశలో నాటిన 15 రోజుల నుంచి పిలకలు కట్టే దశ వరకు సుమారు 15 రోజుల పాటు ముంపును తట్టుకునే రకం. పంట కాలం 135-140 రోజులు. దోమపోటు, అగ్గి తెగులు, మాగుడు తెగుళ్లను కొంత వరకు తట్టుకుంటుంది. సగటున దిగుబడి హెక్టారుకు 6.5 టన్నులు. ఈ రకాలు బ్రీడర్ విత్తనం మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో అందుబాటులో ఉన్నట్టు నరసింహారావు తెలిపారు. 30 కిలోల విత్తన సంచి ధర రూ.2,334. విత్తనాలు కావలసిన రైతులు పని దినాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యాలయంలోనూ లేదా ప్రధాన శాస్త్రవేత్త ఎంవీ కృష్ణాజీ 98481 41939 నెంబరును సంప్రదించాలని కోరారు.

పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

- జిల్లాలో సుమారు 2,44,302 మంది లబ్ధిదారులు
- నిడదవోలు సీహెచ్‌సీ అప్‌గ్రేడేషన్‌కు ప్రతిపాదనలు
- మంత్రి కందుల దుర్గేష్



నిడదవోలులో విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, జూన్ 30: జిల్లాలో ఎన్టీఆర్ భరోసాల పింఛన్లను సుమారు 2,44,302 మంది లబ్ధిదారులకు రూ.16,513 కోట్ల నగదు ఇంటింటికీ పంపిణీ చేయనున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం నిడదవోలులోని ఆనంద్ ఇన్ హోటల్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు జూలై 1వ తేదీ ఉదయం 6గంటల నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు లబ్ధిదారులకు అందించనున్నామన్నారు. ఏప్రిల్, మే, జూన్ మాసాలకు సంబంధించి రూ.3 వేలు, జూలై మాసంలో అందించే రూ.4 వేలతో కలిపి రూ.7 వేలు పింఛనుదారులకు అందిస్తామని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లాలో సీఎం చంద్రబాబు, పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛను అందిస్తారని, నిడదవోలు మండలం గోపవరంలో లబ్ధిదారుల ఇళ్ల వద్దే తానే స్వయంగా పింఛన్లు అందిస్తానని దుర్గేష్ చెప్పారు. గత ప్రభుత్వం హయాంలో నిడదవోలు పట్టణానికి మాస్టర్ ప్లాన్ కూడా లేకుండాపోయిందని, అటు పక్కనున్న తాడేపల్లిగూడెం, ఇటు పక్కనున్న కొవ్వూరుకు కూడా మాస్టర్ ప్లాన్లు ఉన్నాయన్నారు. నిడదవోలులో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఆసుపత్రి చేసేందుకు పూర్తిస్థాయిలో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నా మని అలాగే పట్టణ ప్రజలకు గోదావరి జలాలను తాగునీరుగా అందించే విధంగా చర్యలు తీసుకొంటున్నామని అన్నారు. జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి చాలా అవకాశాలున్నాయని, వాటిని అమలులోకి తెచ్చేందుకు కృషి చేస్తానని దుర్గేష్ అన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకుడు బండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెరవలిలో 10420 మంది లబ్ధిదారులు

పెరవలి, జూన్ 30: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంపీడీవో హిమమహేశ్వరి తెలిపారు. అన్ని రకాల పింఛన్లు కలిపి 10420 ఉన్నాయని, లబ్ధిదారులందరికీ పంపిణీ నిమిత్తం రూ.6.95 లక్షలు బ్యాంకుల నుంచి డ్రా చేసి ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది వద్ద సిద్ధంగా ఉంచినట్టు చెప్పారు. సోమవారం ఉదయం సచివాలయం సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ఈ ఫింఛన్లు అందజేయాలని ఆదేశించినట్టు తెలిపారు. గ్రామాల్లో గ్రామస్థాయి నాయకులు సచివాలయ సిబ్బందితో కలసి చర్చించి, పింఛన్లు సకాలంలో అందే విధంగా ఆయా గ్రామాల్లో చర్చించుకున్నారు. సోమవారం ఉదయాన్నే సచివాలయ సిబ్బందితోపాటు తాము వెంట ఉండి సహకారం అందించాలని నిర్ణయించారు. కానూరు అగ్రహారంలో సచివాలయ సిబ్బంది గ్రామస్థాయి నాయకులు పింఛన్ల పంపిణీపై చర్చించుకున్నారు.

ఉండ్రాజవరంలో 10512 మంది పింఛనుదారులు

ఉండ్రాజవరం, జూన్ 30: మండలంలో సోమవారం 10512 మందికి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో నరేంద్రరెడ్డి తెలిపారు. దీనికి గాను రూ.7.17కోట్లు సొమ్మును సిబ్బందికి అందజేశామన్నారు. వీటి పంపిణీకి 149మంది సచివాలయ, ప్రభుత్వ ఉద్యోగులను నియమించినట్టు చెప్పారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, నాయకుల సమక్షంలో పింఛను సొమ్ము పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.



కొవ్వూరు: తోగుమ్మిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ తేజ్‌భరత్

కొవ్వూరులో 14,272 మంది లబ్ధిదారులు: జేసీ

కొవ్వూరు/చాగల్లు, జూన్ 30: కొవ్వూరు మండల పరిధిలో సోమవారం ఇంటింటికీ ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల కింద గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 14,272 మందికి రూ.9,60,83,000 పంపిణీ చేయాల్సి ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ తెలిపారు. ఆదివారం కొవ్వూరు మండలం తోగుమ్మి గ్రామంలో పింఛన్ల పంపిణీ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పింఛన్ల పంపిణీ సజావుగా చేపట్టాలన్నారు. పింఛన్ల నగదు చెల్లింపులని, ముఖ్యమంత్రి లేఖను ప్రతిఒక్కరికి అందజేసి రశీదు తీసుకోవాలన్నారు. కొవ్వూరు రూరల్ మండలంలో 10257 మందికి రూ.6,82,32,000, కొవ్వూరు పట్టణంలో 4,105 మందికి రూ.2,78,51,000 నగదు పంపిణీకి సిద్ధం చేశామన్నారు. దీని కోసం పట్టణంలో 83 మంది, మండలంలో 160 మంది సిబ్బందిని నియమించామన్నారు. 233 మంది సచివాలయ సిబ్బంది, 10 మంది ఇతరశాఖల సిబ్బందిని నియమించి, మ్యాపింగ్ చేశామని జేసీ చెప్పారు. అలాగే చాగల్లు, నెలటూరు పంచాయతీ కార్యాలయాలను సందర్శించారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, మండల పరిషత్ ప్రత్యేకాధికారి కె.చంద్రశేఖర్, ఎంపీడీవో ఎస్.బుజ్జి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కబళించిన మృత్యువు



ఘటనా స్థలంలో వీర్రాజు, ధనుష్‌చంద్ర మృతదేహాలు (కింద) ఫైల్‌ఫొటోలు

- రోడ్డు ప్రమాదంలో తాత, మనవడు మృత్యువాత
- మోపెడ్‌ను ట్యాంకర్ ఢీకొనడంతో ఘటన
- ఆరికిరేవుల వద్ద ఏటిగట్టుపై సంఘటన



కొవ్వూరు, జూన్ 30: మోపెడ్‌ను లారీ ఢీకొన్న ఘటనలో తాత, మనువడు మృతిచెందినట్టు సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. కొవ్వూరులోని శ్రీరామకాలనీకి చెందిన మాసా వీర్రాజు(44) ఆదివారం కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో ఉన్న కుమార్తె ఇంటికి భోజనానికి వెళ్లాడు. తిరిగి స్వగ్రామం వస్తూ ఆరో తరగతి చదువుతున్న మనవడు పాముల ధనుష్‌చంద్ర(11)ను తీసుకుని మోపెడ్‌పై బయలుదేరారు. ఆరికిరేవుల గ్రామం వద్ద గోదావరి ఏటిగట్టు రోడ్డుపై ఎదురుగా వస్తున్న ట్యాంకరు ఢీకొనడంతో ఇద్దరు కింద పడిపోయారు. తలకు తీవ్ర రక్తగాయాలు కావడంతో అక్కడికక్కడ మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు ధనుష్ చంద్ర తండ్రి పాముల సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

డివైడర్‌ను కారు ఢీకొని ఒకరి మృతి

మరో ఘటనలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఒకరు మృతి చెందినట్టు సీఐ తెలిపారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం (అంకంపాలెం)లోని పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గండికోట ఎస్‌వీ జోగినాథం(28) ఈ నెల 29న కారులో రాజమహేంద్రవరం షాపింగ్‌కు వచ్చాడు. షాపింగ్ పూర్తిచేసుకుని కల్కి సినిమా సెకండ్ షో చూసి తిరిగి జంగారెడ్డిగూడెం వెళ్తుండగా అర్ధరాత్రి కొవ్వూరులోని ఏబీఎన్, పీఆర్ఆర్ డిగ్రీ కాలేజీ సమీపంలో కుక్క అడ్డురావడంతో సడన్‌బ్రేక్ వేశాడు. దీంతో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో జోగినాథానికి తీవ్ర గాయాలై పడి ఉన్నాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఓ డాక్టర్ ఆయనను పరిశీలించి మృతి చెందినట్టు చెప్పారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసు పత్రికి తరలించారు. మృతుడి తండ్రి గండికోట శ్రీరామ సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ జుబేర్ మహ్మద్ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.



కొవ్వూరులో ఏబీఎన్, పీఆర్ఆర్ కాలేజీ వద్ద ప్రమాద దృశ్యం

పోస్టల్ ఉద్యోగుల సమావేశం

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 30: స్థానిక ఆనం రోటరీ సమావేశపు హాలులో జిల్లా పోస్టల్ అసిస్టెంట్స్‌గా 1981-83లో నియమితులైన అభ్యర్థుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి పదవీ విరమణ చేస్తున్న ముమ్మిడి సత్యనారాయణ అధ్యక్షత వహించగా, వి.రవికృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. పలువురు మాట్లాడుతూ సర్వీసుకు సంబంధించి సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ తెలంగాణా హైకోర్టు, సుప్రీం కోర్టు తీర్పును యథావిధిగా వెంటనే అమలు చేయాలన్నారు. లేకపోతే తెలంగాణ, ఆంధ్ర చీఫ్ పోస్టు మాస్టర్ ఎదుట ఆందోళన చేపట్టాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో పుల్లేశ్వరరావు, నాగేంద్రబాబు, కృష్ణమోహన్‌తోపాటు 40మంది పాల్గొన్నారు.

పొగాకు రైతుల సమస్యల పరిష్కారానికి

కేంద్ర మంత్రి చొరవపై ఎంపీ హర్షం

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 30: పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ చొరవ చూపడం పట్ల బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. ఇటీవల పొగాకు రైతులు, వ్యాపారులు, అధికారులతో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ నిర్వహించిన సమావేశంలో తాను కూడా పాల్గొన్నానన్నారు. మూడేళ్లకు ఒకసారి రైతులు నమోదు, పెనాల్టీ మినహాయింపు, పొగాకు బోర్డులో సిబ్బందిని పెంచడం, బ్యారన్ల సమస్యలు తదితర అంశాలను ప్రస్తావించారన్నారు. పొగాకు రైతు ప్రతినిధులతో పాటు కేంద్ర మంత్రిని కలసి వినతిపత్రం సమర్పించినట్టు ఆమె పేర్కొన్నారు.

ఏకగ్రీవంగా ఆర్యాపురం బ్యాంకు పాలక మండలి

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 30: ఆర్యాపురం అర్బన్ బ్యాంకుకు పాలకమండలి ఎన్నికలు లేకుండా ఏకగ్రీవంగా చేసుకోవాల్సిన అవసరం ఉందని, బ్యాంకును పరిరక్షించుకోవడానికి అందరూ సమాయత్తం కావాలని అఖిలపక్ష ప్రజాసంఘాలు నిర్ణయించాయి. ఆదివారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో బ్యాంకు మాజీ డైరెక్టర్ లంక సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ ఆర్యాపురం బ్యాంకు ఎన్నికలు జూలై 20న జరుగుతున్నాయని, ఎన్నికలు లేకుండా పాలకమండలిని ఏకగ్రీవం చేసుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ఆర్యాపురం బ్యాంకు 78 వేల సభ్యులతో పటిష్టంగా ఉందని, అలాంటి బ్యాంకును రక్షించుకోవడానికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాలకమండలిలో ఉండాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలేపల్లి మురళీధర్, సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్, జాంపేట బ్యాంకు డైరెక్టర్ మహంతి లక్ష్మణరావు, బ్యాంకు మాజీ డైరెక్టర్ కొవ్వూరి శ్రీనివాసరావు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కూండ్రపు రాంబాబు మాట్లాడారు. సీపీఐ నగర కార్యదర్శి కొండలరావు, ఆప్ నాయకుడు స్వామి, దేవత సుధాకర్, తారకేష్ పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌హెచ్‌ఎం జేఏసీ సమావేశం

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 30: ఏపీ ఎన్‌హెచ్‌ఎం జేఏసీ తూర్పుగోదావరి జిల్లా సమావేశం ఆదివారం రాజమహేంద్రవరంలోని ఇన్నీసుపేట యూపీహెచ్‌సీలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా టి.సుజాత, ప్రధాన కార్యదర్శిగా జే.రాజశేఖర్, కోశాధికారిగా బీసీహెచ్ శ్రీరాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ సూర్యారాణిను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల రెగ్యులరైజేషన్, సమానపనికి సమాన వేతనం, హెచ్ఆర్ పాలసీ అమలు, ఒన్ టైం సెటిల్‌మెంట్ వంటి డిమాండ్లు సాధించుకోవడానికి రాష్ట్ర కమిటీతో కలిసి పనిచేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ ఏవీ నాగేశ్వరరావు, కేవీ నాయుడు, దయముని పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి ఇంటి వద్ద వంటా వార్పు

అనపర్తి, జూన్ 30: మండలంలోని కుతుకులూరులో వైసీపీ నాయకుడు పడాల హరిసాయి కృష్ణారెడ్డి వల్ల మోసపోయామంటూ మాజీ ఉపసర్పంచ్ పడాల శ్రీనివాసరెడ్డి, వలంటీర్లు చేపట్టిన నిరసన దీక్ష ఆదివారం రెండో రోజు కొనసాగించారు. బాధితులు వంటావార్పు నిర్వహించి తమకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన వారికి భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రెండు రోజులుగా ఇంటి ముందు నిరసన చేపట్టినా సాయిలో మార్పు రాలేదన్నారు. తనకు న్యాయం జరిగే వరకు దీక్షలో ఉంటానన్నారు. కాగా సాయిరామారెడ్డికి మద్దతు తెలుపుదా మంటూ మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి వైసీపీ కార్యకర్తలకు పిలునివ్వడంతో ఆయనతోపాటు వైసీపీ కార్యకర్తలను అనపర్తిలోనే నిలువరించారు.

విద్యార్థి పరిషత్ కో కన్వీనర్‌గా లలిత్‌కుమార్

రాజమహేంద్రవరం కల్చరల్ జూన్ 30: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 26 వరకు జరిగిన ప్రాంత అభ్యాస వర్గలో రాజమండ్రికి చెందిన కె.లలిత్‌కుమార్‌ను స్టేట్ స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ (ఎస్ఎఫ్‌డీ) కోకన్వీనర్‌గా రాష్ట్ర అధ్యక్షులు నియమించారు. ఈ సందర్భంగా లలిత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 77ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల కోసం రాజీలేని పోరాటం చేస్తామన్నారు.

ఎమ్మెల్యే వాసును కలిసిన యాదవ సంక్షేమ సంఘం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 30: రాజమహేంద్రవరం అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను స్థానిక తిలక్‌రోడ్డులోని ఆయన కార్యాలయంలో శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఆదివారం అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు నొడగల సుధాయాదవ్, శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు కరగాని వేణుయాదవ్, అధ్యక్షుడు జానా కేశవయాదవ్, ప్రధాన కార్యదర్శి బొట్ట వీరబాబు యాదవ్, మాజీ అధ్యక్షుడు చావలి రాజేశ్వరరావు యాదవ్ ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ యాదవులు తన సొంత ఇంట్లో మనుషులని ఎప్పుడు అవసరం వచ్చినా అండగా ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వారాధి హనుమంతరావు యాదవ్, ఉర్లంకల లోకేష్ యాదవ్, పూస పూడి రాము యాదవ్, ప్రకృతి సత్తిబాబు, పట్టపగలు ప్రకాశరావు, తుల్లి పద్మ, కొయ్యన కుమారి తదితరులు పాల్గొన్నారు.

సంతానం కలగడం లేదని ఆత్మహత్య

కాలువలో దూకిన వివాహిత

ఉండ్రాజవరం, జూన్ 30: సంతానం కలగడం లేదని మనస్తాపం చెందిన ఒక మహిళ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన దమ్మెన్నులో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మోర్త గ్రామానికి చెందిన తోట రాశి(24)కి 2020లో ఉండ్రాజవరం గ్రామానికి చెందిన దుర్గారావుతో వివాహమైంది. నాలుగేళ్లయినా సంతానం కలగకపోవడంతో మనస్తాపం చెంది శనివారం దమ్మెన్ను గ్రామం వద్ద నరసాపురం కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతదేహం ఆదివారం లభ్యమయ్యింది. ఆమె తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఉండ్రాజవరం పోలీసులు తెలిపారు.